# వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

- క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు సిద్ధం చేయాలి
- ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్

కడప(కలెక్టరేట్), అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో విస్తారంగా కురుస్తున్న వర్షాల కారణంగా అధికారులందరూ అప్రమత్తంగా ఉంటూ నిరంతర పర్యవేక్షణ చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్ అన్నారు. జిల్లాలో బుధవారం నుంచి కురిసిన వర్షాల కారణంగా అవాంఛనీయ సంఘటనలు, నష్ట వివరాలపై జిల్లా స్థాయి అధికారుల నుంచి, మండల స్థాయి అధికారుల వరకు గురువారం టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ రెండు రోజులుగా జిల్లాలో కురుస్తున్న వర్షాలతో ప్రాణ, పశు, పంట నష్టాలు జరగకుండా తీసుకున్న చర్యలపై ఆరా తీశారు. జిల్లాలోని రిజర్వాయర్లకు చేరుతున్న నీటి మట్టాన్ని నిరంతరం గమనిస్తుండాలన్నారు. చెరువులు, వాగులు, వంకలు, కాలువలు తెగిపోకుండా జాగ్రత్తగా చూసుకోవడంతో పాటు వాటిపై 24 గంటలు నిఘా ఉంచాలన్నారు. ఇప్పటి దాకా జరిగిన నష్టాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వర్ష ప్రభావం తగ్గిందని అధికారులు ఏమరుపాటుగా ఉండరాదని, నిరంతరం అప్రమత్తంగా ఉంటూ పర్యవేక్షణ చేయాలని అన్నారు.

# మబ్బుల ఊసులు



కనుచూపుమేరా పచ్చని పొలాలు.. వాటికి ఆనుకుని రక్షణగోడలా కొండల వరుసలు.. ఆ కొండలతో ఊసులాడుతున్నట్టు తెల్లని మబ్బులు.. ఈ సుందర దృశ్యం గురువారం కడప నగరంలోని రాజంపేట రోడ్డు నుంచి ఇర్కాన్ సర్కిల్ వరకు ఉన్న రింగ్‌రోడ్డు వద్ద చూపరులకు కనువిందు చేసింది.

– ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కడప



ఆర్జీయూకేటీ ఆధ్వర్యంలో ఇడుపులపాయలో ఏర్పాటు చేసిన ట్రిపుల్‌ఐటీ పేదింటి బిడ్డలకు వరంగా మారింది. పేద, నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఇంజనీరింగ్ చదువుకునే అవకాశం దక్కింది. ట్రిపుల్‌ఐటీల్లో చదువుకుని మల్టీనేషనల్ కంపెనీల్లో లక్షలాది వేతనంతో సాఫ్ట్‌వేర్ కొలువులు సాధించగా.. మరికొందరు గెజిటెడ్ ఆఫీసర్లుగా, ఐఏఎస్‌లుగా ఎంపికయ్యారు. దీంతో ట్రిపుల్‌ఐటీ ద్వారా ఆ కుటుంబాల్లో వెలుగులు నిండాయి. ఉన్నత సాంకేతిక విద్యను అందిస్తూ వేలాదిమందికి ఉన్నత ఉద్యోగాలు దక్కేలా చేస్తున్న ట్రిపుల్‌ఐటీ విజయగాథపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.





ఆంధ్రజ్యోతి ప్రత్యేకం



# పేదింటి బిడ్డలకు.. పెద్ద ఉద్యోగాలు

## మిజోరం డిప్యూటీ కమిషనర్‌గా శివగోపాల్‌రెడ్డి



ఈయన పేరు చీమల శివగోపాల్‌రెడ్డి. తండ్రి సాధారణ రైతు శివారెడ్డి. వీరిది కడప జిల్లా మైదుకూరు మండలం చిన్నయ్యగారిపల్లె. సాధారణ రైతు కుటుంబానికి చెందిన ఈయన 10వ తరగతి వరకు స్వగ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదివారు. 2012 నుంచి 2018 వరకు ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో చదివి కెమికల్ ఇంజనీర్ అయ్యారు. 2019లో జపాన్‌లో ఉన్నత ఉద్యోగ అవకాశం వచ్చినప్పటికి వదులుకుని సివిల్స్‌కు ప్రిపేర్ అయి 2019 యూపీఎస్సీలో 263ర్యాంకు సాధించారు. కేంద్రపాలిత ప్రాంతాల కేడర్‌కు ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. ప్రస్తుతం మిజోరం రాష్ట్రంలో డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్నారు. ట్రిపుల్‌ఐటీలో చదివిన సాధారణ రైతు కుటుంబానికి చెందిన వ్యక్తి ఐఏఎస్‌కు ఎంపిక కావడం ఆర్జీయూకేటీకి గర్వకారణమని అధికారులు చెబుతారు.

- ట్రిపుల్‌ఐటీలో చదివి ఐఏఎస్‌లుగా ఎంపిక
- మల్టీనేషన్ కంపెనీల్లో లక్షల వేతనంతో సాఫ్ట్‌వేర్ కొలువులు
- పేదలకు వరంగా మారిన ట్రిపుల్‌ఐటీ విద్య

వేంపల్లె, అక్టోబరు 17: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2008వ సంవత్సరంలో ఆర్జీయూకేటీ ఆధ్వర్యంలో ఇడుపులపాయ, నూజివీడు, బాసరలో ట్రిపుల్‌ఐటీలను నెలకొల్పారు. ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అమెరికాలోని కార్నిజెంట్ యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా ఉన్న రాజిరెడ్డిలు వినూత్నంగా ఆలోచించి ట్రిపుల్‌ఐటీలను రూపొందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు వెయిటేజీ మార్కులిచ్చి ఆరు సంవత్సరాల సమీకృత ఇంజనీరింగ్ డిగ్రీని ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులంటే అధిక శాతం పేద, నిరుపేద కుటుంబాలకు చెందిన పిల్లలే. ఒక్కో ట్రిపుల్‌ఐటీలో రెండువేల మంది విద్యార్థులకు అవకాశం కల్పించారు. రాష్ట్రం విడిపోయాక ఆంధ్రప్రదేశ్‌లో ఒంగోలు, శ్రీకాకుళంలో ట్రిపుల్ ఐటీలను నెలకొల్పారు. ఒక్కో ట్రిపుల్‌ఐటీలో వెయ్యి మంది విద్యార్థులకు అవకాశం కల్పిస్తున్నారు. ప్రస్తుతం నాలుగు ట్రిపుల్‌ఐటీల్లో 24,000 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరందరికి విద్యాబోధనతో పాటు ఉచిత వసతి, భోజనం ఏర్పాటుచేశారు.

### ప్లేస్‌మెంట్ విభాగం ఏర్పాటు

వినూత్న ఆలోచనలతో ప్రారంభమైన ట్రిపుల్‌ఐటీల్లో ప్రధానంగా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీపై అధిక ప్రాధాన్యత ఇచ్చి విద్యాబోధన సాగించారు. ల్యాప్‌టాప్‌ల ద్వారానే విద్యనందించారు. ఇక్కడ చేరిన విద్యార్థులకు ఉన్నత ఉద్యోగ అవకాశాలు రావాలన్న ఉద్దేశంతో ప్రత్యేక ప్లేస్‌మెంట్ విభాగాన్ని ఏర్పాటుచేశారు. 2008లో ప్రారంభమైన ట్రిపుల్‌ఐటీ 2014వ సంవత్సరలో ఇంజనీరింగ్ ఫైనలియర్ చదువుతున్న విద్యార్థులకు..

మిగతా 6వ పేజీలో..

## చిత్తూరు జాయింట్ కలెక్టర్‌గా విద్యాధరి



ఈమె పేరు గొబ్బిళ్ల విద్యాధరి. ఈమెది అన్నమయ్య జిల్లా రాజంపేట నియోజకవర్గంలోని నందలూరు. సాధారణ కుటుంబానికి చెందిన ఈమె 2008 నుంచి 2014 వరకు ట్రిపుల్‌ఐటీలో చదివి ఈసీఈ పూర్తిచేశారు. రెండేళ్ల క్రితం యూపీఎస్సీలో 211వ ర్యాంకు సాధించారు. ఈమె ప్రస్తుతం చిత్తూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఇటీవల ఆమెకు ట్రిపుల్ ఐటీలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ.. క్రమశిక్షణతో లక్ష్యాన్ని సాధించేందుకు కష్టపడి చదవడం వల్లే తనకు ఈ అవకాశం దక్కిందని అన్నారు.



ఇటీవల ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో న్యాక్ టెక్నాలజీకి రూ.6లక్షల వార్షిక వేతనంతో ఎంపికైన 82 మంది విద్యార్థులతో డైరెక్టర్ కుమారస్వామి గుప్త

వాల్మీకి జయంతి కార్యక్రమంలో పాల్గొన్న ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్



# వాల్మీకి జీవితం ఆదర్శనీయం

- ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్

కడప(కలెక్టరేట్/క్రైం), అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): రామాయణాన్ని లోకానికి అందించిన ఆదికవి వాల్మీకి మహర్షి జీవితం అందరికీ ఆదర్శనీయం అని ఇన్‌చార్జి కలెక్టర్ అదితి సింగ్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమం, బీసీ కార్పొరేషన్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఇన్‌చార్జి కలెక్టర్ వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వాల్మీకి మహర్షి 24వేల శ్లోకాలతో మానవాళికి అద్భుతమైన రామాయణ కావ్యాన్ని అందించారన్నారు.కృషి ఉంటే మనుషులు రుషులు అవుతారని వాల్మీకి జీవితం తెలియజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డీర్వో గంగాధర్ గౌడ్, సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతీ, బీసీ సంక్షేమాధికారి కృష్ణయ్య, బీసీ కార్పొరేషన్ ఈడీ జయసింహ, వాల్మీకి ఉద్యోగసంఘాల అధ్యక్షుడు శ్రీనివాసులు, రాష్ట్ర బీసీ సంఘ అధ్యక్షుడు అవ్వారు మమల్లికార్జున, ఏపీ వాల్మీకి సేవ సంఘ అధ్యక్షుడు భోగ్యం రమణ, తలాడి కుల సంఘ నాయకుడు సుంకర వాగేశ్వర రావు, రాష్ట్రదూదేకుల కులసంఘ అధ్యక్షుడు సుంకేశల ఖాదర్ బాషా తదితరులు వాల్మీకి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

అలాగే ఎస్పీ క్యాంపు కార్యాలయం కాన్ఫరెన్స్ హాలులో గురువారం వాల్మీకి మహర్షి చిత్రపటానికి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మానవతా విలువలను, ఉన్నతమైన ఆదర్శభావాలను బోధించే మధురకావ్యం రామాయణం అన్నారు. రామాయణం స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ మానవతా విలువలను పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ మురళీధర్, జిల్లా పోలీసు కార్యాలయం ఏవో జ్యోతి, పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పుశంకర్ తదితరులు పాల్గొన్నారు.



వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

# కడప అభివృద్ధికి కృషి చేస్తా

- కమిషనర్ ఎన్.మనోజ్‌రెడ్డి



బాధ్యతలు స్వీకరిస్తున్న మనోజ్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కడప అభివృద్ధికి కృషి చేస్తానని మున్సిపల్ కమిషనర్ ఎన్.మనోజ్‌రెడ్డి అన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. గురువారం కడప కార్పొరేషన్ కమిషనర్ చాంబరులో ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కలెక్టరు ఆదేశాలతో కడప అభివృద్ధికి సంపూర్ణంగా కృషి చేస్తానన్నారు. త్వరలో అధికారులతో సమీక్షించి డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరుస్తామన్నారు. వర్షం వచ్చినప్పుడు నీరు నిలబడకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే మంచినీటి సరఫరాకు ఇబ్బందులు లేకండా చర్యలు తీసుకుంటామన్నారు. కార్పొరేషన్‌లో ప్రభుత్వ భూముల ఆక్రమణలు జరిగి ఉంటే అధికారులతో రివ్యూ చేసి భూములను వెనక్కి తీసుకుంటామని స్పష్టం చేశారు.

### విద్య నేపథ్యం

కడప కమిషనర్ ఎన్.మనోజ్‌రెడ్డి పాఠశాల విద్య రాయచోటిలో సాగింది. అనంతరం ముంబైలో ఐఐటి గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. సివిల్స్‌కు శిక్షణ తీసుకుంటూ 2022లో గ్రూప్-1లో డిప్యూటీ కలెక్టరుగా ఎంపికయ్యారు. పలమనేరు ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం బదిలీపై కడప నగరపాలక సంస్థ కమిషనర్‌గా వచ్చారు. వీరి సతీమణి తేజస్విని ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీసుకు ఎంపికై ప్రస్తుతం ఢిల్లీలో శిక్షణ తీసుకుంటున్నారు.

# వీడని వర్షం

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా మూడు రోజులుగా కురుస్తున్న వర్షం వల్ల కడప నగరం శివారు ప్రాంతాల వాసులు విలవిల్లాడుతున్నారు. గురువారం ఉదయం వర్షం కొంత నిలిచినప్పటికీ మళ్లీ సాయంత్రానికంతా ఉరుములు మెరుపులతో ప్రారంభమైంది. దీంతో పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. గురువారం రాత్రంతా వర్షం కురుస్తూ ఉంది.

# గాడిన పడని 'కిక్కు'

మందుబాబుల నాలిక జే బ్రాండ్లతో చప్పబడిపోయింది. రోజూ తాగే మద్యం జగన్ హయాంలో దూరమైంది. వేరే గత్యంతరం లేక జే బ్రాండ్స్‌ను తాగేశారు. జె బ్రాండ్స్ నుంచి ఎప్పుడు విముక్తి వస్తుందా అని మందుబాబులు ఎదురు చూశారు. కూటమి ప్రభుత్వం నాణ్యమైన మద్యం తీసుకువస్తామని ప్రకటించింది. తక్కువ ధరకే మద్యం ఇస్తామని కూడా చెప్పింది. ఈ మేరకు మద్యం అమ్మకాలను ప్రైవేటుకు అప్పగించింది. అయితే మద్యంషాపుల వ్యవహారం ఇంకా గాడిన పడలేదు. ప్రభుత్వం చెప్పినట్లు రూ.99 బ్రాండ్లు అందుబాటులోకి రాలేదు. మద్యం రేటు తగ్గలేదు. దీంతో మందుబాబులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



పులివెందులలోని ఓ దుకాణంలో మద్యం సీసాలకు పూజ చేసిన దృశ్యం

- పూర్తిస్థాయిలో ప్రారంభం కాని మద్యం దుకాణాలు
- దుకాణాలు దొరక్క లైసెన్సుదారుల అవస్థలు
- మద్యంషాపుల కోసం భారీగా పెంచిన అద్దెలు
- వైన్‌షాపుల్లో కనిపించని రూ.99 బ్రాండ్లు
- మద్యం ధరలు తగ్గలేదంటూ మందుబాబుల గగ్గోలు
- కొత్తస్టాకు వస్తే ధరలు తగ్గుతాయంటున్న అధికారులు



మద్యం దుకాణంలో అందుబాటులో ఉన్న బ్రాండ్లు

(కడప-ఆంధ్రజ్యోతి): జిల్లాలో 139 మద్యంషాపులకు ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వగా 3257 దరఖాస్తులు వచ్చాయి. లాటరీ ద్వారా దుకాణాలు కేటాయించారు. మద్యంషాపులు దక్కించుకోవడం కోసం పలువురు టీడీపీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు పోటీపడ్డారు. వారి అనుచరుల ద్వారా భారీ స్థాయిలో దరఖాస్తులు వేయించారు. సీఎం చంద్రబాబునాయుడు లాటరీలో పారదర్శకంగా వ్యవహరించడంతో లక్కున్న వారికే షాపులు దక్కాయి. బ్రాంది షాపుల కోసం ఆరాటపడ్డ కూటమి నేతలకు నిరాశే మిగిలింది. దక్కిన వారి నుంచి కొందరు షాపులు తీసుకునే ప్రయత్నం చేయగా మరికొందరు భాగానికి వెళ్లారని అంటున్నారు. అయితే జిల్లా టీడీపీలో కోల్డ్ వార్ జరుగుతోంది. కడుపులో కత్తులు పెట్టుకున్న విధంగా తయారయ్యారని చెబుతారు. దీంతో ఆధిపత్యం కోసం వైన్‌షాపులపై ప్రతాపం చూపిస్తున్నారు. జగన్ హయాంలో మద్యంషాపులన్నీ ప్రభుత్వమే నడిపింది. కేవలం బార్లు మాత్రమే ప్రైవేటుకు ఇచ్చారు. ఇప్పుడు మద్యంషాపులు ప్రైవేటుకు ఇవ్వడంతో కూటమి, వైసీపీ నేతలు తమ మార్కు కోసం పోటీపడుతున్నారు.

### 119 షాపులు ప్రారంభం

జిల్లాలో 139 మద్యంషాపులు ఉండగా రెండురోజులైనా ఇంకా 119షాపులు మాత్రమే తెరుచుకున్నాయి. రాజకీయ వత్తిళ్ల కారణంగా కొన్ని తెరచుకోలేదు. గురువారం సాయంత్రం లోపు ఏడుగురు లైసెన్సుదారులు మద్యం కొనుగోలు చేయలేదు. వాటాల్లో తేడా, రాజకీయ వత్తిడి, మా ఏరియాలో ఎందుకు పెడతారంటూ బెదిరింపుల కారణంగానే పూర్తిస్థాయిలో షాపులు తెరవలేదంటారు.

### అద్దెలతో చుక్కలు

లాటరీ ద్వారా లక్కీ చాన్స్ కొట్టామనుకుంటున్న మద్యం వ్యాపారులకు ఇప్పుడు దుకాణం పెట్టుకునేందుకు అద్దెకు షాపులు దొరక్కపోవడం కలవరపెడుతోంది. కడపలో ప్రధాన వీధుల్లో కూడా ఓ ఫ్యాన్సీ స్టోరు (పుస్తకాలు, పెన్నులు తదితరాలు) పెట్టుకునే వాటికి అద్దె రూ.30వేల వరకు ఉంటుంది. బిజినెస్ కేంద్రం వైవీ స్ట్రీట్‌లో పెద్దపెద్ద పోర్షన్లు రూ.40వేలు రూ.50వేలకు దొరుకుతాయి. అయితే ఇప్పుడు మద్యంషాపుల కోసం ఇచ్చే కేవలం చిన్న రూముకు రూ.లక్ష పైగానే వసూలు చేస్తుండడం గమనార్హం. పాతబస్టాండులో గృహ నిర్మాణశాఖలో పనిచేసిన ఉద్యోగికి మద్యం దుకాణం తగిలిందని చెబుతారు. అక్కడ రూము దొరకక ఇబ్బందులు పడుతుండగా కడప నేతలే లైన్‌లోకి వచ్చి ఆ షాపులో వాటా తీసుకుని రూము సెట్ చేశారని అంటున్నారు. ముద్దనూరులో ఓషాపు కూటమి ప్రభుత్వంలో కీరోల్‌గా ఉన్న ఓ నేత సోదరుడికి వచ్చిందంటారు. అయితే ఇక్కడ స్థానికులు అడ్డంకులు సృష్టించారంటారు. ప్రస్తుతం మొబైల్ టిఫిన్ సెంటరు మాదిరి లిక్కరు షాపు నడిపేందుకు రెడీగా ఉన్నట్లు సమాచారం.

### మందుబాబుల నిరుత్సాహం

ప్రైవేటు మద్యంషాపులు వస్తే మద్యం ధరలు బాగా తగ్గుతాయని ప్రచారం సాగింది. కొత్తపాలసీ ప్రకారం రూ.99లకే మద్యం దొరుకుతుందంటూ ప్రభుత్వం చెప్పుకొచ్చింది. దీంతో మందుబాబులు అంతా సంబరపడ్డారు. అయితే ఏ దుకాణంలోనూ రూ.99కే మద్యం దొరకలేదు. ప్రస్తుతం పాత రేట్లే ఉండడం చూసి మందుబాబులు ప్చ్ అంటూ నిరాశ వ్యక్తం చేస్తున్నారు. ఎన్నెన్నో చెప్పి ఇలా చేస్తారా అంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు. అయితే ధరలపై నేడో రేపో ప్రభుత్వం తేల్చనుందని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. మద్యం ధరలు తగ్గకపోవడంతో వైసీపీ నేతలు 'తగ్గిన మద్యం ధరల లిస్టు' అంటూ ట్రోల్ చేశారు.

# పేదింటి బిడ్డలకు.. పెద్ద ఉద్యోగాలు

5వ పేజీ తరువాయి

● ట్రిపుల్‌ఐటీలో చదివి ఐఏఎస్‌లుగా ఎంపిక ● మల్టీనేషన్ కంపెనీల్లో లక్షల వేతనంతో సాఫ్ట్‌వేర్ కొలువులు


ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ క్యాంపస్ భవన సముదాయం


ల్యాప్‌టాప్‌ల ద్వారా విద్యనభ్యసిస్తున్న ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు

క్యాంపస్ ఇటర్వ్యూలను ఏర్పాటుచేయించడమే ఈ ప్లేస్‌మెంట్ విభాగం లక్ష్యం. వివిధ కంపెనీలతో మాట్లాడి వారిని ట్రిపుల్‌ఐటీలకు పిలిపించి క్యాంపస్ సెలక్షన్లను ఏర్పాటుచేయించడంతో ప్రతిభ ఉన్న విద్యార్థులు పరీక్షల్లో పాల్గొని ఉద్యోగాలు పొందేవారు. వీలైనన్ని ఎక్కువ కంపెనీలను ట్రిపుల్‌ఐటీలకు రప్పించడం లక్ష్యంగా ఈ ప్లేస్‌మెంట్ విభాగం పనిచేస్తోంది.

### ఇంజనీర్లుగా, గెజిటెడ్ ఆఫీసర్లుగా, ఐఏఎస్‌లుగా

ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో ఆరుసంవత్సరాల సమీకృత ఇంజనీరింగ్ చదివిన 11 బ్యాచ్‌లు బయటకు వెళ్లాయి. సుమారు 15,000 మంది విద్యార్థులు చదువుకున్నారు. వీరిలో చాలా మంది ఇంజనీర్లుగా ప్రభుత్వ, ప్రైవేటు విభాగాల్లో పనిచేస్తున్నారు. మల్టీనేషనల్ కంపెనీలైన అమెజాన్, టీసీఎస్, ఐబి, న్యాక్ టెక్నాలజీస్, హుండై, క్యూట్, జోరియంట్, ఇంటెల్, మ్యాపిల్ తదితర ఎన్నో కంపెనీలు చేపట్టిన క్యాంపస్ ఇంటర్వ్యూల ద్వారా సెలెక్ట్ అయి ఉద్యోగాలు చేస్తున్నారు. కొందరు గెజిటెడ్ ఆఫీసర్లుగా పనిచేస్తున్నారు. కడప జిల్లా ఖాజీపేట మండలం చిన్నయ్యగారిపల్లెకు చెందిన చీమల శివగోపాల్‌రెడ్డి, అన్నమయ్య జిల్లా నందలూరుకు చెందిన విద్యాధరి ఐఏఎస్‌కు ఎంపికై డిప్యూటీ కమిషనర్, జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్నారు.

### బయటకెళ్లాక మరింత మంచి వేతనాలు

ట్రిపుల్‌ఐటీల్లో చదువుకుంటూ క్యాంపస్ సెలక్షన్స్‌లో మల్టీనేషనల్ కపెనీలకు ఎంపికైన విద్యార్థులు లక్షల్లోనే వార్షిక వేతనం తీసుకుంటున్నారు. ఉద్యోగం చేస్తూనే కొత్తకొత్త కంపెనీల్లో ఉద్యోగ అవకాశాల కోసం ప్రయత్నించి మరింత మంచి వేతనం పొందే ఉద్యోగాలు పొందిన వారు చాలా మందే ఉన్నారని, ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో అకడమిక్ డీన్‌గా పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ రత్నకుమారి తెలిపారు. ఇక్కడ చదువుకున్న విద్యార్థులు ఉద్యోగాలు పొందడంతో పాటు ఎంటెక్, ఎంఎస్, పీహెచ్‌డీ వంటి ఉన్నత విద్యనభ్యసించేందుకు వెళ్లినవారు ఉన్నారని అన్నారు.

### వరంగా మారిన ట్రిపుల్‌ఐటీ విద్య

ట్రిపుల్‌ఐటీలు ముఖ్యంగా పేద, నిరుపేద కుటుంబాలకు వరంలాంటివని చెప్పవచ్చు. ట్రిపుల్‌ఐటీల్లో ఎక్కువగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకే ప్రాధాన్యత ఇవ్వడంతో చాలా మంది కూలీలు, డ్రైవర్లు, రైతులు, ఇతర వర్గాల కుటుంబాల్లోని పిల్లలు ఇక్కడ చదువుకున్నారు. చాలా మంది విద్యార్థులు చక్కగా చదివి ఇంజనీర్లు అయ్యారు. ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో పనిచేయడం, మల్టీనేషనల్ కంపెనీల్లో సాఫ్ట్‌వేర్ కొలువుల్లో చేరి లక్షలాది రూపాయలు వేతనాలు పొందడం ద్వారా ఆ కుటుంబాల ఆర్థిక పరిస్థితి మెరుగైంది.

### బయట కంపెనీలకు అనుగుణంగా శిక్షణ

ప్రస్తుతం మార్కెట్‌లో కంపెనీలకు ఏయే అవసరాలు ఉన్నాయి అనే దానిపై అధ్యయనం చేసి విద్యార్థులకు వాటిపైనే శిక్షణ ఇస్తున్నాం. ప్లేస్‌మెంట్ సెల్‌ను మరింత బలోపేతం చేశాం. 24గంటలు నడిచే ప్రత్యేక కంప్యూటర్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశాం. కోడింగ్, డీకోడింగ్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌పై ఫైనలియర్‌తో పాటు మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు.. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ గురించి పీయూసీ నుంచే శిక్షణ ఇస్తున్నాం. ట్రిపుల్‌లో ఐటీ చేరిన విద్యార్థులు బాధ్యతగా కష్టపడి క్రమశిక్షణతో చదువుకుంటే క్యాంపస్ సెలక్షన్ల ద్వారా, ఇతర మార్గాల ద్వారా ఉద్యోగాలు కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

**- ప్రొఫెసర్ కుమారస్వామి గుప్త, డైరెక్టర్ ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ**

### ఎక్కువమందికి ఉద్యోగ కల్పనే లక్ష్యం

ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో చేరిన అందరు విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. ప్రత్యేక స్కిల్ ట్రైనింగ్ ప్రోగ్రాంను వినూత్నంగా పీయూసీ నుంచే మొదలుపెడుతున్నాం. మద్రాస్ ఐఐటీతో ఒప్పందం చేసుకున్నాం. టాటా కోడింగ్, అనలాజికల్ ఇంటలిజెన్స్‌పై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. ఫైనలియర్ విద్యార్థులతో పాటు కొత్తగా మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు సెకెండ్ సెమిస్టర్ నుంచే ఇంటర్వ్యూలో ఎలా పాల్గొనాలి, పరీక్షలు ఎలా రాయాలి అనే వాటిపై శిక్షణ ఇస్తున్నాం. తద్వారా వీలైనంత ఎక్కువ మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ఆర్జీయూకేటీ లక్ష్యంగా పనిచేస్తున్నాం.

**- ప్రొఫెసర్ అమరేంద్రకుమార్ సంద్ర, రిజిస్ట్రార్, ఆర్జీయూకేటీ**


ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో చేర్పించేందుకు పిల్లలను పిలుచుకెళ్తున్న తల్లిదండ్రులు


ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో చేరేందుకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఎంపికైన విద్యార్థులు


మల్టీనేషనల్ కంపెనీకి ఎంపికైన ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ విద్యార్థులతో ట్రిపుల్‌ఐటీ అధికారులు

### వందలాది మందికి ఉద్యోగాలు

ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో చదివిన పేద, నిరుపేద, మధ్యతరగతి కుటుంబాల వారికి ఉద్యోగ అవకాశాలు లభించాయి. క్యాంపస్ సెలక్షన్ల ద్వారా ఉద్యోగాలు రాగా చదువు పూర్తయి బయటకు వెళ్లాక పలువురు విద్యార్థులు ఉద్యోగాలు పొందారు. ఇప్పటి వరకు ఇడులపాయ ట్రిపుల్‌ఐటీలో వివిధ కంపెనీల్లో క్యాంపస్ సెలక్షన్ల ద్వారా ఎంపికైన విద్యార్థుల వివరాలు, వారు పొందిన వార్షిక వేతనాలు వివరాలు..

| బ్యాచ్ | ఉద్యోగాలకు ఎంపికైనవారు | వార్షికవేతనం రూ.లక్షల్లో |
|---|---|---|
| 2008 | 365 | 16 |
| 2009 | 292 | 13 |
| 2010 | 288 | 13.20 |
| 2011 | 244 | 8.20 |
| 2012 | 264 | 7.20 |
| 2013 | 290 | 14.93 |
| 2014 | 299 | 14 |
| 2015 | 306 | 24 |
| 2016 | 560 | 17.30 |
| 2017 | 396 | 12 |
| 2018 | 425 | 14 |

## ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రాధాకృష్ణ



రాయచోటిటౌన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) అమరావతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బి.రాధాకృష్ణను ఎన్నుకున్నారు. బుధవారం అమరావతిలో జరిగిన సమావేశంలో రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. ఇందులో భాగంగానే రాయచోటి పట్టణంలోని మాసాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలపై చిత్తశుద్ధితో పనిచేస్తూ ప్రభుత్వంతో చర్చించి ఉపాధ్యాయులకు రావాల్సిన పీఆర్‌సీ, ఐఆర్‌జీవో 117, సీపీఎస్ రద్దు, బదిలీలు, పదోన్నతుల సాధనకు కృషి చేస్తామని తెలిపారు.

## కొండ మీద పిడుగు


పిడుగుపడడంతో అక్కుమలకొండ మీద చెలరేగిన మంటలు

చిన్నమండెం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): చిన్నమండెం మండలంలోని బోరెడ్డిగారిపల్లెకు సమీపాన ఉన్న అక్కుమలకొండమీద గురువారం సాయంత్రం 5 గంటల సమయంలో కురిసిన వర్షానికి పిడుగుపడడంతో కొండమీద మంటలు చెలరేగాయి. అయితే బోరెడ్డిగారిపల్లెకు కాస్త దూరం ఉండడంతో ఎలాంటి నష్టం జరగలేదు. అదే కాస్త ఇటు అయ్యింటే పల్లెలోనే పడిందేదని గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. ఆ పరిసర ప్రాంతాల్లో ఎవరు జనాలు లేకపోవడంతో ఎలాంటి నష్టం జరగలేదు.

## శభాష్.. తేజశ్విని.. చంద్రబాబు ప్రశంస


సీఎం చంద్రబాబుతో సీఎం ర్యాంకర్ తేజశ్విని

తంబళ్లపల్లె, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రైతు కుటుంబంలో పుట్టి కృషి, పట్టుదలతో చదివి సీఏ, సీఎంఏలో ఆలిండియా ర్యాంకు సాధించిన రైతు బిడ్డ తేజశ్వినిని సీఎం చంద్రబాబునాయుడు ప్రశంసించారు. తంబళ్లపల్లె మండలం కన్నెమడుగుకు చెందిన కె.రఘురాంరెడ్డి, నాగవేణి దంపతుల కుమార్తె తేజశ్విని తల్లితండ్రుల కష్టాన్ని చూస్తూ చిన్నతనం నుంచే చదువులో ప్రతిభ కనపరిచేది. ప్రాథమిక విద్య తంబళ్లపల్లెలో పూర్తి చేసి జవహర్ నవోదయలో సీటు సాధించింది. సీఏ చేయాలనే లక్ష్యంతో గుంటూరు మాస్టర్ మైండ్స్‌లో చేరి కృషి, పట్టుదలతో చదివి ఈ ఏడాది జూలై 11న విడుదలైన సీఏ ఫైనల్ ఫలితాల్లో 455 మార్కులతో ఆలిండియా 14వ ర్యాంకు సాధించింది. అంతేకాకుండా, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ఆగస్టు 23న విడుదల చేసిన సర్టిఫైడ్ మేనేజ్‌మెంట్ అకౌంటెంట్ (సీఎంఏ) ఫలితాల్లో ఆలిండియా మొదటి ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం, మాస్టర్ మైండ్స్ యాజమాన్యం ఆహ్వానం మేరకు బుధవారం సాయంత్రం తేజశ్విని తండ్రి రఘురాంరెడ్డి, చిన్నాన్న అమర్‌నాథరెడ్డితో కలసి సచివాలయంలో సీఎం చంద్రబాబును కలసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా సీఎం తేజశ్వినిని అభినందించారు.

## పింఛా ప్రాజెక్టును పరిశీలించిన అధికారులు


పింఛా ప్రాజెక్టును పరిశీలిస్తున్న అధికారులు

సుండుపల్లె, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పింఛా సమీపంలో ఉన్న యర్రపురెడ్డి ఆదినారాయణరెడ్డి ప్రాజెక్టును ఇరిగేషన్ ఈఈ వెంకట్రామయ్య గురువారం పరిశీలించారు. పింఛా ప్రాజెక్టులోకి పై ప్రాంతాల నుంచి వస్తున్న వర్షపు నీరు వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వర్షం అధికంగా పడితే పై ప్రాంతాల్లో పాటు అటవీ ప్రాంతం నుంచి ఎక్కువ నీరు వచ్చే అవకాశాలు ఉన్నాయని అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి నీటి సామర్థ్యాన్ని చెక్ చేయాలన్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 164 క్యూసెక్కుల నీరు వస్తున్నట్లు తెలిపారు. అలాగే ప్రాజెక్టు దిగువ భాగంలో నది పరీవాహక ప్రాంతాల్లోకి ప్రజలను ఎవరిని వెళ్లకుండా అప్రమత్తం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ చెంగల్‌రాయుడు, ఏఈ నాగేంద్రనాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

## పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో


వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్‌వో

నందలూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : అన్నమయ్య జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ కొండయ్య మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అధిక వర్షపాతం కారణంగా రవాణాకు దూరంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి అక్కడ వ్యాధులు ప్రబలకుండా అన్ని చర్యలు తీసుకోవాలని తెలిపారు.

గర్భిణులను గుర్తించి వారిని కాన్పుల కోసం దగ్గరలోని వారికి ఇష్టమైన ఆసుపత్రుల్లో చేర్పించాలని సూచించారు. అలాగే షుగర్, బీపీ, తీవ్రమైన జబ్బులతో బాధపడుతున్న వారిని గుర్తించి ప్రభుత్వాసుపత్రిలో చేర్పించాలన్నారు. వర్షం తగ్గిన తర్వాత లోతట్టు ప్రాంతాల్లో నీటి నిల్వలు ఉండి మలేరియా, డెంగ్యూ జ్వరాలు, విరేచనాలు ప్రబలేందుకు అవకాశం ఉందని కాబట్టి తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆశాలకు, మహిళ ఆరోగ్య కార్యకర్తలకు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో పనిచేసే కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మందుల కొరత లేకుండా చూడాలన్నారు. ల్యాబ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ కార్తీక్, విశ్వనాథ్, సీహెచ్‌వో వెంకటనారాయణ, సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

## ఉద్యాన పంటల పరిశీలన


పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

నందలూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందలూరు, నాగిరెడ్డిపల్లె గ్రామాల్లో అధిక వర్షాలకు దెబ్బతిన్న వ్యవసాయ ఉద్యాన పంటలను రాజంపేట ఉద్యాన అధికారి సురేష్‌బాబు, మండల వ్యవసాయాధికారి జి.మల్లికార్జున గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధిక వర్షాలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు పలు సూచనలు చేశారు. వ్యవసాయాధికారి మల్లికార్జున మాట్లాడుతూ అధిక వర్షాలకు వరి పొలాల్లో నిలబడిన నీటిని ప్రత్యేక కాలువల ద్వారా వెంటనే బయటికి పంపాలని తెలిపారు. నేలకొరిగిన వరి పైరును కట్టలుగా కట్టి నిలబెట్టుకోవాలి. అలాగే కోత కోసి నిల్వ ఉంచిన వరికుప్పలపై ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేసుకోవాలని రైతులకు సూచించారు. ఉద్యాన అధికారి జి.సురేష్‌బాబు మాట్లాడుతూ ఉద్యాన పంటలైన అరటి, నిమ్మ, పసుపు, బొప్పాయ పంటల్లో తేమ ఆరిన తరువాత 13.0.45 5 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో షణ్ముఖ్, వీహెచ్‌ఏ వరున్, రైతులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ తడుస్తోంది...

● కలెక్టర్ ఛాంబర్‌లో లీకేజీ ● ప్రతి రూములోనూ ఇదే పరిస్థితి
● మరమ్మతులు చేయడానికి నిధులు లేవంటున్న ఆర్‌అండ్‌బీ


కలెక్టర్ ఛాంబర్ ముందు వర్షపు నీటిని తుడుస్తున్న దృశ్యం

రాయచోటి (కలెక్టరేట్), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ఏర్పాటు చేసిన కలెక్టరేట్ భవనాలు కొద్దిపాటి వర్షానికి తడిసి ముద్ద అవుతున్నాయి. అప్పటి ప్రభుత్వం జిల్లాలు ఏర్పాటు చేస్తూ బాలుర గిరిజన గురుకుల పాఠశాలను కలెక్టరేట్ కార్యాలయంగా ఏర్పాటు చేసుకునేందుకు వెసులుబాటు కల్పించింది. అయితే అందుకోసం దాదాపు రెండు కోట్ల రూపాయలు వెచ్చించి భవనాలను అనుకూలంగా మార్చి కలెక్టరేట్‌గా ఏర్పాటు చేసుకున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో కలెక్టరేట్‌లోని అన్ని భవనాలు తడిసి ముద్దవుతున్నాయని సిబ్బంది చెబుతున్నారు. కలెక్టర్ ఛాంబర్‌లో కూడా నీళ్లు కారడం, అలాగే ముఖ్యమైన సెక్షన్లలో కూడా వర్షపు నీరు రావడం ఇక్కడ పనిచేస్తున్న సిబ్బందికి ఇబ్బందికరంగా ఉందని తెలిసింది. గతంలో ఉన్న కలెక్టర్ కూడా ఇలాగే వర్షం పడినపుడు కారుతూ ఉంటే బిల్డింగుపైన ప్లాస్టింగ్ చేయించారని, అయినప్పటికీ కూడా మళ్లీ వర్షాలు వస్తే అక్కడక్కడా కారుతోందని సిబ్బంది చెబుతున్నారు. మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్, ప్రజా సమస్యల పరిష్కార వేదిక హాల్‌కు పీయూపీ చేయడం వల్ల నీరు కారణం కనిపించలేదు. పీయూపీ లేని పక్షంలో ఆ బిల్డింగులు కూడా వర్షపు నీరు వచ్చే ప్రమాదం ఉందని కొంతమంది ఉద్యోగులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వమైనా కొత్త జిల్లాలపై శ్రద్ధ పెట్టి భవనాలకు మరమ్మతులు చేస్తే బాగుంటుందని ఉద్యోగులు కోరుతున్నారు. ఈ విషయంపై కలెక్టరేట్ ఏవో నాగభూషణంను వివరణ కోరగా వర్షం ఆగిన తర్వాత కలెక్టరేట్ భవనంలో ఎక్కడెక్కడ లీకేజీలు ఉన్నాయో వాటికి మరమ్మతులు చేయిస్తామని తెలిపారు.


స్లాబ్ నుంచి కారుతున్న వర్షం నీళ్లు

## నిమ్మనపల్లి వాసి బెంగళూరులో దారుణ హత్య

● వివాహేతర సంబంధమే కారణం


బాలాజి (ఫైల్)

నిమ్మనపల్లి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం కారణంగా నిమ్మనపల్లి వాసి బెంగళూరులో స్నేహితుడి చేతిలో దారుణ హత్యకు గురైన సంఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని రాచవేటివారిపల్లి పంచాయతీ గుండ్లబురుజు దళితవాడకు చెందిన బాలాజీ (24) ఉపాధి నిమిత్తం మూడేళ్లుగా బెంగళూరులోని ఓ కంపెనీలో పనిచేస్తుండేవాడు. అయితే రామసముద్రం మండలానికి చెందిన రెడ్డెప్పరెడ్డితో స్నేహం ఏర్పడింది. కాగా రెడ్డెప్పరెడ్డి తన భార్య పిల్లలతో బెంగళూరులోని దొడ్డనహళ్లిలో కాపురం ఉంటున్నాడు. బాలాజీ అప్పడప్పుడు రెడ్డెప్పరెడ్డి ఇంటికి వెళుతూ అతడి భార్యతో పరిచయం పెంచుకున్నారు. వారి పరిచయం వివాహేతర సంబంధానికి దారితీసింది. ఈ విషయం రెడ్డెప్పరెడ్డికి తెలియడంతో ఎలాగైనా బాలాజీని చంపాలని పథకం వేశాడు. ఈ క్రమంలో తన భార్య పిల్లలను రామసముద్రంకు పంపించి బాలాజీని ఆదివారం తన ఇంటికి తీసుకెళ్లాడు. అనంతరం ఇద్దరూ మద్యం తాగి ఆ మత్తులో బాలాజీని దారుణంగా హత్య చేశాడు. వెంటనే ఇంటి తలుపులు వేసుకుని అక్కడి నుంచి పరారయ్యాడు. నిమ్మనపల్లి నుంచి బాలాజీ తండ్రి రమణ, తల్లి నాగమ్మలు ఫోన్ చేసినా తీయకపోవడంతో అనుమానం వచ్చి బెంగళూరులోని పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అక్కడికి వెళ్లి చూడగా బాలాజి చనిపోయి ఉండటాన్ని గమనించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

దీంతో గురువారం బాలాజీ మృతదేహన్ని గుండ్లబురుజుకు తరలించారు. అయితే ఒక్కగానొక్క కుమారుడు చనిపోవడంతో తల్లిదండ్రులు భోరున విలపించారు. దీనిపై బెంగళూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## తెగుళ్లు..ఆపై వర్షం దెబ్బ..


వాల్మీకిపురం వద్ద వర్షానికి దెబ్బతిన్న టమోటా పంట

● టమోటా, వంకాయ నేలపాలు

వాల్మీకిపురం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రెండురోజులుగా కురుస్తున్న వర్షం రైతులను తీవ్ర నష్టాలకు గురి చేస్తోంది. వాల్మీకిపురం సమీపంలో రైతు శేఖర్ సుమారు పదిఎకరాలకుపైగా టమోటా, వంకాయ, బొప్పాయి, మునగ తోటలను పదిలక్షలు వెచ్చించి సాగు చేశాడు. టమోటా వర్షంతో దెబ్బతిని రాలిపోతుండటం, వంకాయకు కుళ్లు తెగుళ్లు, మునగకు బంక తెగుళ్లతో పూత మొత్తం రాలిపోవడం, ఉన్న అరాకొర రాయలు కూడా నలుపు రంగులోకి తిరిగి తీవ్ర నష్టం వాటిల్లింది. బొప్పాయి పంట వ్యాపారులు రాకపోవడంతో కాయలను తోటల్లోనే వదిలేశారు. ఆరుగాలం శ్రమించి పంటలు సాగుచేస్తే ఇలా తెగుళ్లు, వర్షం దెబ్బకు నష్టపోతున్నామని, కనీసం కూలీలు కూడా గిట్టుబాటు కాని పరిస్థితులు నెలకొన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే మండలంలోని శాఖంవారిపల్లెకు చెందిన వెంకటరమణనాయుడు రూ.14లక్షలు ఖర్చు చేసి నాలుగు ఎకరాలలో టమోటా పంట సాగుచేస్తే కోతకొచ్చిన సమయాన వర్షం దెబ్బకు టమోటాలు పగుళ్లు వచ్చి రాలిపోతుండటంతో నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక భోగంపల్లె సమీపంలో రైతు రమణారెడ్డికి చెందిన వరిపైరు వర్షం దాటికి దెబ్బతిని నష్టం వాటిల్లింది. తుఫాను వర్షం కారణంగా మండలం వ్యాప్తంగా పంటలకు నష్టం వాటిల్లింది.


దెబ్బతిన్న టమోటా పంట చూపుతున్న రైతు వెంకటరమణనాయుడు


### కూలీలు కూడా రావడం లేదు..



లక్షలు ఖర్చు చేసి పంటలు సాగుచేస్తే పంట చేతికొచ్చే సమయాన తెగుళ్లతో మందుల భారం ఎక్కువవుతోంది. పదిఎకరాలకు పైగా టమోటా, వంకాయ, బొప్పాయి, మునగ పంటలు సాగుచేశాను. రెండు రోజులుగా పంటలన్నీ నష్టమే. ఉన్న అరాకొర పంట కోసి మార్కెట్‌కు తీసుకెళ్తే కనీసం కూలీలు కూడా గిట్టుబాటు కావడం లేదు. నష్టాలలో కూరుకుపోతున్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

**-శేఖర్, రైతు, వాల్మీకిపురం.**

# బురకాయలకోట సీతాఫలం... రుచి మధురం



ఈ ప్రాంతంలోని అడవులు, కొండలు, గుట్టల్లో సీతాఫలం చెట్లు పెద్దఎత్తున ఉన్నాయి. ఇక్కడ సహజ సిద్ధంగా స్వచ్ఛమైన వాతావరణంలో పండే ఈ సీతాఫలాలు ఎంతో మధురంగా ఉంటాయి. వీటికి ఎలాంటి రసాయనాలు, పురుగుల మందులు వాడరు. దీంతో బురకాయలకోట సీతాఫలంకు మంచి డిమాండ్ ఉంది. ఇక్కడి నుంచి సీతాఫలం కాయలు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటారు. దీంతో కూలీలకు ఉపాధితో పాటు వ్యాపారులు మంచి ఆదాయం పొందుతున్నారు.

- సహజ సిద్ధంగా కాపు.. మంచి డిమాండ్
- ఇతర రాష్ట్రాలకు తరలింపు
- కూలీలకు ఉపాధి.. వ్యాపారులకు ఆదాయం

ములకలచెరువు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ములకలచెరువు మండలం బురకాయలకోట, దేవళచెరువు, సోంపాళ్యం, కాలువపల్లె, నల్గొండ, బి.కొత్తకోట మండ లం హార్సిలీహిల్స్, గట్టు, తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లె, ముద్దలదొడ్డి, పెద్దతిప్పసముద్రం మండలం కందుకూరు, బి.కొత్తకోట మండలం బయప్పగారిపల్లె, ఉలవలవారిపల్లె, కురబలకోట మండలాల గ్రామాల సమీపాల్లో ఆడవులు, కొండలు, గుట్టలు అధికంగా ఉన్నాయి. ఇక్కడ సీతాఫలం చెట్లు వేలల్లో ఉన్నాయి. ప్రతి ఏటా వర్షాకాలంలో సీతాఫలం కాయలు కాస్తాయి. ఈ ప్రాంతాల నుంచి కూలీలు కాయలను కోసుకొచ్చి బురకాయలకోటలో విక్రయానికి తీసుకొస్తారు. అలాగే శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు, నల్లచెరువు, సరిహద్దులో ఉన్న కర్ణాటక రాష్ట్రం బాగేపల్లె, చేలూరు తదితర ప్రాం తాల నుంచి కూడా కాయలను కోసుకొచ్చి విక్రయించడానికి కూలీలు ఇక్కడికి తెస్తున్నారు. ఆగస్టు నుంచి నవంబరు ఆఖరు వరకు సీజన్ నడుస్తుంది. ఇక్కడ కూలీల దగ్గర నుంచి సీతాఫలం కాయలను వ్యాపారులు కొనుగోలు చేసి వాటిని గ్రేడింగ్ చేసి రాష్ట్రంలోని గుంటూరు, విజయవాడ, కర్నూల్, రాజమండ్రి, అనంతపురం నంద్యాల, విశాఖపట్నం తదితర పట్టణాలకు తరలి స్తారు. అలాగే తెలంగాణ రాష్ట్రం హైదరాబాదు, మిర్యాలగూడ,మహబూబ్‌నగర్, సిరిసిల్ల, కరీంనగర్, కర్ణాటక రాష్ట్రం బెంగళూరు, రాయచూర్, గుల్బర్గా, సిందనూరు, హాస్పేట్, హుబ్లీ, బళ్లారి, మహారాష్ట్ర రాష్ట్రం సోలాపూర్, తమిళనాడు రాష్ట్రం చెన్నై, కోయంబత్తూరు ప్రాంతాలకు ఎగుమతి చేసి విక్రయిస్తుంటారు.

**కూలీలకు జీవనోపాధి**

ప్రతి ఏడాది సీతాఫలం కాయలతో ఈ ప్రాంతాల్లోని కూలీలు ఉపాధి పొందుతున్నారు. ఆగస్టు నుంచి నవంబరు నెల వరకు సీతాఫలం కాయలు కోసుకొచ్చి ఇక్కడి తెచ్చి విక్రయిస్తారు. కూలీలు ప్రతి రోజు ఉదయమే అడవులు, కొండలు, గుట్టలకు వెళ్లి కాయలు సేకరించి సాయంత్రం బురకాయలకోటకు తీసుకొచ్చి వ్యాపారస్థులకు విక్రయిస్తారు. వ్యాపారులు కూలీల వద్ద నాణ్యతను బట్టి ఒక్కో క్రేట్‌ను రూ.400 నుంచి రూ.600 వరకు కొనుగోలు చేస్తున్నారు. ఒక్కో కూలీ ప్రతి రోజు రెండు నుంచి మూడు క్రేట్ల కాయలు సేకరించి అమ్మకానికి తీసుకొచ్చి రూ.వెయ్యి నుంచి రూ.1500 వరకు సంపాదిస్తున్నారు. గతంలో ఇక్కడి నుంచి ప్రతి రోజూ 2వేల క్రేట్ల వరకు ఎగుమతి అయ్యేవి. కాగా కాయలు సైజులు వచ్చే సమయంలో ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో నెలకొన్న వర్షాభావం కారణంగా కాయలు సైజులు లేకపోవడంతో ప్రతి రోజూ 600 క్రేట్ల వరకు కాయలు ఎగుమతి అవుతున్నాయి.



బురకాయలకోట నుంచి ఎగుమతి చేసేందుకు క్రేట్లలో సిద్ధం చేసిన సీతాఫలం కాయలు



**జీవనోపాధి దొరుకుతోంది**

సీతాఫలం కాయల ద్వారా ప్రతి ఏటా జీవనోపాధి లభిస్తోంది. మా ఊరికి సమీపంలో ఉన్న కొండలు, గుట్టల్లోకి వెళ్లి ప్రతిరోజూ రెండు క్రేట్ల కాయలను కోసుకొచ్చి ఆటో బాడుగకు మాట్లాడుకుని బురకాయలకోటకు తీసుకొచ్చి అమ్ముకుంటున్నాం. వర్షాలు బాగా కురిసి కాయలు బాగా కాస్తే మంచి ఉపాధి దొరుకుతుంది.

- రామలక్ష్మమ్మ, కూలీ, బురకాయలకోట

**ఇష్టంగా తింటారు**

సహజ సిద్ధంగా కాచే ఇక్కడి సీతాఫలం కాయలను ఇష్టంగా తింటారు. ప్రతిరోజూ రెండు బాక్సుల కాయలు కోసుకొచ్చి రూ.వెయ్యి వరకు సంపాదిస్తున్నాను. అయితే ఈ ఏడాది ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో వర్షం కురవక సీతాఫలం కాయలు సైజు రాలేదు. దీంతో కాయల దిగుబడి తగ్గింది.



- మునెమ్మ, కూలీ, బురకాయలకోట

## వరద ప్రభావిత ప్రాంతాలలో సబ్ కలెక్టర్ పర్యవేక్షణ



పునరావాస కేంద్రంలో వరద బాధితులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

రైల్వేకోడూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గత మూడు రోజుల నుంచి రైల్వే కోడూరులో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముందు జాగ్రత్త చర్యగా రాజంపేట సబ్ కలెక్టర్ నిదియాదేవి బుధవారం అర్ధరాత్రి వరకు రైల్వేకోడూరులోనే తిష్ట వేసి వరద ప్రభావిత ప్రాంతాలలో పరిస్థితులను పర్యవేక్షించారు. రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్, వైద్య ఆరోగ్య తదితర శాఖలకు చెందిన అధికారులు, సిబ్బందితో కలసి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. కాగా, సబ్ కలెక్టర్ ఆదేశాల ప్రకారం రైల్వేకోడూరు తహసీల్దార్ మహబూబ్‌చాంద్ తమ సిబ్బందితో ఐదు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి బుధవారం సాయంత్రం వరద బాధితులను తరలించి.. రాత్రి భోజనాలు తగిన వసతులను ఏర్పాటు చేయించారు. గురువారం ఉదయం, మధ్యాహ్నం మళ్లీ వర్షాలు కురుస్తాయనే ఉద్దేశ్యంతో ముందుస్తుగా పునరావాస కేంద్రాల్లో వరద బాధితులకు అల్పాహారాలు, భోజనాలు ఏర్పాటు చేయించారు.

## గండికోటకు 3వేల క్యూసెక్కుల వరదనీరు

కొండాపురం/ మైలవరం అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రెండురోజులగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకల ద్వారా గండికోట పాజెక్టులోకి గురువారం 3వేల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరిందని డీఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. అదేవిధంగా అవుకు రిజర్వాయిర్ నుంచి మరో 4300 క్యూసెక్కుల కృష్ణాజలాలు ప్రాజెక్టులోకి వస్తున్నాయన్నారు. ఇప్పటికే ప్రాజెక్టులో తగినంత నీటిమట్టం ఉండటంతో గేట్లు ఎత్తి మైలవరం జలాశయానికి 7500 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 26.2 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. కాగా, మైలవరం జలాశయం నుంచి పెన్నా నదికి నీటి విడుదల కొనసాగుతుంది. గురువారం గండికోట జలాశయం నుంచి 7,500 క్యూసెక్కుల నీరు వచ్చి మైలవరంలో చేరుతుండటంతో పెన్నానదికి 8 వేల క్యూసెక్కులు, ఉత్తర కాలువకు 25 క్యూసెక్కులు, దక్షిణ కాలువకు 200 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు జలాశయ నరసింహమూర్తి తెలిపారు. మైలవరానికి గండికోట నుంచి ఇన్‌ఫ్లో పెరిగితే మరింత నీటిని పెన్నానదికి వదిలే అవకాశం ఉందని పెన్నా పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

## క్షేత్ర స్థాయిలో సమస్యలు పరిష్కారం



మాట్లాడుతున్న మిషన్ వాత్సల్య శిశు సంక్షేమశాఖ జాయింట్ డైరెక్టరు

కడప నాగరాజుపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): శిక్షణ కార్యక్రమాలతో క్షేత్ర స్థాయిలో సమస్యలను పరిష్కరించవచ్చని మిషన్ వాత్సల్య శిశు సంక్షేమశాఖ జాయింట్ డైరెక్టరు ఎ.విజయ పేర్కొన్నారు. గురువారం కడప డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో కర్నూలు రీజియన్‌లోని కడప, కర్నూలు, చిత్తూరు, నంద్యాల, అన్నమయ్య, తిరుపతి, శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాలలో కొత్తగా నియామకం అయిన మిషన్ వాత్సల్య సిబ్బందికి రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటువంటి శిక్షణ కార్యక్రమాలకు హాజరై శిక్షణ పొందడం వల్ల మనకు తెలియని చాలా విషయాలు తెలుసుకోవచ్చొన్నారు. వివిధ జిల్లాల అనుభవాలను చర్చించుకోవడం ద్వారా క్షేత్రస్థాయిలో వచ్చే సమస్యలను ఏ విధంగా పరిష్కరించాలో తెలుసుకోవచ్చన్నారు. ప్రాంతీయ సంయుక్త సంచాలకులు రోహి ణి, జిల్లా స్త్రీ మరియు శిశు సంక్షేమ సాధికారత అధికారి డి.శ్రీలక్ష్మి, ప్రోగ్రాం మేనేజరు కమల్‌కుమార్, వాత్సల్య సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రారంభమైన పీజీ ప్రవేశాల కౌన్సెలింగ్



అభ్యర్థుల సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేస్తున్న అధికారులు

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వైవీయూలో గురువారం పోస్టుగ్రాడ్యుయేషన్ కళాశాలలో ప్రవేశాలు ప్రారంభం అయ్యాయి. ప్రవేశాలకు విద్యార్థులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. 25 కోర్సులకు ఏపీ పీజీ సెట్ 2024 అర్హత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్లను డాక్టర్ రామక్రిష్ణ, డాక్టర్ గణేశ్‌నాయక్ పరిశీలించారు. ఈ ప్రవేశాలు ఈనెల 1వ తేదీ వరకు కొనసాగుతాయని ప్రవేశాల సంచాలకులు డాక్టర్ లక్ష్మి ప్రసాద్ తెలిపారు.

## డ్రాగా ముగిసిన అండర్-14 క్రికెట్ మ్యాచ్‌లు

కడప(స్పోర్ట్స్), అక్టోబర్ 17 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్-14 మెన్స్ మల్టీడే రెండు రోజుల ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా గురువారం వివిధ జట్ల మధ్య జరగాల్సిన మ్యాచ్‌లు వర్షం కారణంగా డ్రాగా ముగిశాయి. ఓ మ్యాచ్ పూర్తిగా ఆట సాగలేదు. వివరాలిలా....

నగర రిమ్స్ సమీప వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో కడప-విశాఖ జట్ల మధ్య సాగిన రెండవ రోజు ఆటలో వర్షం కారణంగా మ్యాచ్‌ను 39 ఓవర్లకు కుదించారు. దీంతో టాస్ నెగ్గిన కడప జట్టు ఫీల్డింగ్ చేయగా బ్యాటింగ్‌కు దిగిన విశాఖ జట్టు 39 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 234 పరుగులు చేసింది. ఇందులో రామ్‌చరణ్ 80 పరుగులు, వినోద్, 52, ధమన్‌రెడ్డి 51 పరుగులు చేశారు. తదుపరి బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు చివరి రోజు ఆట ముగిసే సమయానికి 39 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 98 పరుగులు మాత్రమే చేసింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. అలాగే కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో గురువారం ఈస్ట్‌గోదావరి- వెస్ట్ గోదావరి జట్ల మధ్య సాగిన మ్యాచ్ వర్షం కారణంగా 25 ఓవర్లకు కుదించారు. టాస్ నెగ్గిన ఈస్ట్ గోదావరి జట్టు తొలుత బ్యాటింగ్ చేపట్టి నిర్ణీత 25 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 127 పరుగులు సాధించింది. ఇందులో కార్తీక్ 65 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన వెస్ట్ గోదావరి జట్టు 25 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 99 పరుగులు చేసింది. దీంతో నిర్వాహకులు మ్యాచ్‌ను డ్రాగా ముగించారు. ఇక కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో ప్రకాశం-కర్నూలు జట్ల మధ్య జరగాల్సిన మ్యాచ్ వర్షం కారణంగా పూర్తిగా తుడిచి పెట్టుకుపోయింది. 16, 17 తేదీలలో (బుధ, గురువారం) వర్షం కారణంగా ఆట సాగలేదు.



వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న మ్యాచ్



80 పరుగులు సాధించిన రామ్‌చరణ్, 65 పరుగులు చేసిన కార్తీక్

## అందరికి అందుబాటులో ఇసుక : ఇన్‌చార్జి కలెక్టర్

పెండ్లిమర్రి, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్త గంగిరెడ్డిపల్లె గ్రామంలో ఇసుక క్వారీని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, ఇన్‌చార్జి కలెక్టర్ అదితిసింగ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఇన్‌చార్జి కలెక్టర్ మాట్లాడుతూ ఎక్కడ ఎలాంటి లోపాలు జరగకుండా సంబంధిత అధికారులు ప్రజలకు ఇసుకను అందేలా చూడాలన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలో భాగంగా అందరికి అందుబాటులోకి ఇసుకను తీసుకొచ్చామన్నారు. మండలంలోని కొత్త గంగిరెడ్డిపల్లె, మాచునూరు, కొండూరు, నందిమండలం గ్రామాల పరిధిలోని పాపాఘ్ని నదిలో ఇసుక రీచ్‌లను ఏర్పాటుచేశామన్నారు. ఇది ప్రజా ప్రభుత్వమని, కూటమి ప్రభుత్వంలో ఎలాంటి అక్రమాలకు తావు లేకుడా ప్రజలందరికి అందుబాటులో ఇసుక పాలసీని ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అనురాధ, ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి, ఇతర అధికారులు, టీడీపీ అధ్యక్షుడు గంగిరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి కిషోర్‌రెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



ఇసుక లోడింగ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి, కొబ్బరికాయ కొట్టి ఇసుక రీచ్‌ను ప్రారంభిస్తున్న జాయింట్ కలెక్టర్ అదితిసింగ్

## శిక్షణ తరగతులు రద్దు చేయాలి




సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసులు

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : 1, 2తరగతులు బోధించే ఉపాధ్యాయులకు ఎఫ్ఎల్ఎన్ శిక్షణ తరగతులను రెసిడెన్షియల్ పద్ధతిలో నిర్వహించడాన్ని రద్దు చేయాలని ఎస్టీఎఫ్ జిల్లాగౌరవాధ్యక్షుడు శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం కడప ఎస్టీఎఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎఫ్ఎల్ఎన్ శిక్షణ తరగతులు అక్టోబరు 21 నుంచి 26 వరకు ఆరు రోజుల పాటు రెసిడెన్షియల్ పద్ధతిలో రాష్ట్రంలో 9 కేంద్రాల్లో ఏర్పాటు చేసినట్లు ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ శిక్షణ కార్యక్రమం వల్ల ఏకోపాధ్యాయ పాఠశాలల్లో విద్యార్థులు బోధనకు దూరమయ్యే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం పునరాలోచించి ఈ శిక్షణను రద్దు చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి వెంకటసుబ్బయ్య, అన్నమయ్య జిల్లా గౌరవాధ్యక్షుడు లక్ష్మీనారాయణరెడ్డి, నాయకులు రాజగోపాలరెడ్డి, క్రిష్ణఫర్‌జాన్, ప్రసాద్, మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు, రవిశంకర్ పాల్గొన్నారు.

## మేకల కాపరి అదృశ్యం

అట్లూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలువాండ్లపల్లె గ్రామానికి చెందిన సొంట గంగిరెడ్డి నాలుగు రోజుల క్రితం అదృశ్యమయ్యాడు. అడవిలో మేకలను మేపుకోవడానికి వెళ్లి కనిపించకుండా పోయాడు. గురువారం కలవాండ్లపల్లె వరికుంట ఎస్సీ కాలనీ, బీసీ కాలనీవాసులు సుమారు 80 మంది బృందాలుగా ఏర్పడి అడవిలో వెతికినా గంగిరెడ్డి ఆచూకీ తెలియలేదు. దీంతో బద్వేలు నుంచి డ్రోన్ కెమెరాలు తెప్పించి ప్రయోగించిన గంగిరెడ్డి ఆచూకీ లభించలేదు. ఈ మేరకు భార్య ఓబులమ్మ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామక్రిష్ణ తెలిపారు.

## ఆటో డ్రైవర్ ఆత్మహత్య

మదనపల్లె అర్బన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): భార్య కాపురానికి రాలేదని ఆటో డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మదనపల్లెలో చోటు చేసుకుంది. పోలీసులు వివరాల మేరకు మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లె రామిరెడ్డిలేవుట్‌లో నివశిస్తున్న రియాజ్ బుధవారం రాత్రి ఇంట్లో ఉరివేసుకుని మృతి చెందాడు. ఇతను ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. 2011లో తాసీజ్‌భానుతో వివాహం అయింది. వీరికి నలుగురు పిల్లలు ఉన్నారు. కుటుంబ విషయమై భార్య భర్తలు గొడవపడ్డారు. సోమవారం భర్తపై అలిగి పుట్టింటికి తమ పిల్లలను తీసుకుని భార్య వెళ్లిపోయింది. ఆమె తిరిగి రాకపోవడంతో మనస్తాపానికి గురైన రియాజ్ ఇంట్లో ఉరివేసుకుని మృతి చెందాడు. అలకతీరిన భార్య తిరిగి గురువారం ఇంటికి వచ్చి చూడగా.. భర్త మృతి చెందిన విషయం వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించింది. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ చాంద్‌బాషా తెలిపారు.

## వ్యక్తి ఆత్మహత్య

బి.కొత్తకోట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపల్లె అటవీప్రాంతంలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. మృతుడు నాగరాజు(52) వాల్మీకిపురం టౌన్ నమాజుకట్ట వీధికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. కూలీపనుల నిమిత్తం బి.కొత్తకోట ప్రాంతానికి వచ్చిన నాగరాజు స్థానికంగా నివాసం వుంటూ ఒంటరిగా జీవనం సాగించేవాడు. ఈనేపథ్యంలో గుడిపల్లి వద్ద చెట్టుకు ఉరివేసుకొని ప్రాణాలు తీసుకున్నాడు. ఇతని మృతికి దారితీసిన కారణాలు తెలియాల్సి వుందని బి.కొత్తకోట సీఐ రాజారెడ్డి పేర్కొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి

మదనపల్లె అర్బన్, అక్టోబరు 17: మదనపల్లె పట్టణం, ఈస్ట్ కొత్తపేటలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు వన్‌టౌన్ సీఐ చాంద్‌బాషా తెలిపారు. గురువారం ఏభైఐదేళ్ల కలిగిన గుర్తుతెలియని వ్యక్తి చనిపోయి ఉండడానికి గుర్తుంచిన స్థానికులు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే సంఘనస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి అనంతరం పోస్టుమార్టం కోసం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చనిపోయి వ్యక్తి ఆచూకీ తెలిస్తే సమాచారం ఇవ్వాలన్నారు.

## మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో జాప్యం తగదు




డీఈవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు వర్తించే అన్ని సౌకర్యాలు మున్సిపల్ టీచర్లుకు కూడా కల్పించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి మహేశ్‌బాబు తెలిపారు. గురువారం కడప డీఈవో కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ హైస్కూళ్లలో ఇప్పటికీ తగినంత సబ్జెక్టు టీచర్లు లేరని, 3, 4, 5 తరగతులను విలీనం చేశారు తప్ప ఆ తరగతులు బోధించడానికి స్కూలు అసిస్టెంట్లను ఇవ్వలేదన్నారు. పదోన్నతులు, బదిలీలు కూడా రెగ్యులర్‌గా జరగడం లేదన్నారు. ఎప్పుడు నిర్వహిస్తారో కూడా తెలియని పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం పంచాయతీరాజ్ టీచర్లకు ఇచ్చినట్లే మున్సిపల్ టీచర్లకు అర్బన్ ఎంఈవో పోస్టులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం డీఈవో అనురాధకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ ట్రెజరర్ నరసింహారావు, కార్యదర్శులు సీవీ రమణ, ఎజాజ్ హ్మద్, నాయకులు ప్రభాకర్, రూత్ ఆరోగ్యమేరీ, క్రిష్టారెడ్డి, మేరీ ప్రసన్న పాల్గొన్నారు.

## పబ్లిక్ అండ్ హెల్త్ ఈఈగా జె.రమణమూర్తి



కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): కడప కార్పొరేషన్ పబ్లిక్ అండ్‌హెల్త్ ఈఈగా జె.రమణమూర్తి గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాశ్వత నీటి పరిష్కారానికి బ్రహ్మంసాగర్ ప్రాజెక్టు నుంచి కడప బండికనుమ వరకు 55 కి.మీ మేర పైపులైను నిర్మిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు కడప కార్పోరేషన్ నిధులు రూ.540 కోట్లతో ఈప్రాజెక్టును పూర్తి చేస్తామని తెలిపారు.

# ఆయకట్టు రోడ్డు గతి అంతేనా?

● పొలానికి వెళ్లాలన్నా.. శవాలను తీసుకెళ్లాలన్నా చచ్చేంత పని.. పట్టించుకునే వారేరి?

చెన్నూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : ఆయకట్టు రోడ్లకు మండలంలో అతీగతీ లేకుండా పోయింది. గత ప్రభుత్వంలో పంట పొలాలకు వెళ్లే దారులు పూర్తిగా విస్మరించడంతో ఈ ఐదేళ్లలో అత్యంత దారుణంగా తయారయ్యాయి. మోకాలిలోతు గుంతలతో పొలానికి వెళ్లే రైతులు పడే కష్టాలు అన్నీ ఇన్నీ కావు. వర్షం కురిసిందా ఇక్కడ అంతే సంగతి. పైగా కొన్ని చోట్ల ఇదే దారుల్లో మృతదేహాలను కూడా తీసుకువెళ్లాల్సిన పరిస్థితి ఉండడంతో ఆ ప్రాంత ప్రజలకు ఇది చచ్చేంత పనిగా మారింది. దీంతో అటు రైతులు ఇటు ప్రజలు తీవ్ర ఆవేదనకు లోనవుతున్నారు. ఇలాంటి పరిస్థితే మండలంలోని నరసారెడ్డిపల్లెలో నెలకొంది. ఈ గ్రామానికి పక్కనే ఉన్న కేసీఆయకట్టు రోడ్డు అత్యంత దారుణం. దాదాపు 3 కి.మీ ఉన్న ఈ ఆయకట్టు రోడ్డు ఎక్కడ చూసినా మోకాలిలోతు గుంతలే. చినుకుపడితే చిత్తడే. దీంతో పలువురు రైతులు ఈ ఖరీఫ్ కాంలో వరినాట్లు వేసుకునే అవకాశం ఉన్న కేసీ కాల్వకు నీరు వస్తున్నా దారిని చూసి భయపడి విత్తనాలు, ఎరువులు ఇతర వ్యవసాయ నులు ఈ దారి గుండా వెళ్లి ఎలా చేసుకోవాలని మానుకున్నారు. ఈ వర్షాకాలం పోయాక రబీలో అయినా పంట సాగు చేసుకుందాం, లేకుంటే మరింత ఆలస్యంగా అయినా వరిసాగు చేసుకుందామన్న పరిస్థితికి వచ్చారు. ఎన్నో ఏళ్లుగా ఈఆయకట్టు దారి అత్యంత దారునంగా ఉంది. అప్పట్లో టీడీపీ పాలనలో ఈ దారిని బాగు చేయడం జరిగింది. రైతుల అవసరాల కోసం గ్రావెల్‌రోడ్లు వేసి కొంత వరకు ఇబ్బంది లేకుండా చేశారు. ఆ తరువాతనే రైతులకు ఆయకట్టు రోడ్డు కష్టాలు మొదలయ్యాయి. ప్రతియేటా మూడు నెలల పాటు ఈ దారి రైతులకు నరకం చూపిస్తోంది. ఊరి నుంచి మొదలు ఈ మూడుకిమీ మేర ఎక్కడా కూడా 20 నుంచి 30 అడుగులు కూడా రోడ్డు సరిలేదు. అంతా గుంతలమయమే.





దారుణంగా ఉన్న నరసారెడ్డిపల్లె పక్కన ఆయకట్టు దారి... నడవడానికి వీలు లేని నరసారెడ్డిపల్లె స్మశానానికి వెళ్లే దారి

రైతులు ఈ దారిలో వ్యవసాయ పనులకు వెళ్లాలంటే జంకే పరిస్థితి. గతంలో ఎంతో మందికి ఈ దారి బాగుచేయఽడి మహాప్రభో అని మొత్తుకున్నా పట్టించుకోలేదు. ఆయకట్టు రోడ్డు అంటే ఇంత నిర్లక్ష్య మా, ఇంత అధ్వాన్నంగా ఉందని ఎన్నోమార్లు నిర్లక్ష్యం చూపించారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఈ దారి ఎంతో బాగుండగా బాగా వెళ్లేవారు. ఇప్పుడు ట్రాక్టర్లలో వెళ్లాలన్నా ఇబ్బందిగా ఉందంటున్నారు.

**శవాలు మోసుకెళ్లాలన్నా ఇదే పరిస్థితి**

గ్రామంలో ఎవరయినా చనిపోతే వారి మృతదేహాలను ఇదే దారి గుండా మోసుకెళ్లాలి. ఈ మధ్యలో అంటే దాదాపు కిలోమీటరు పైన శ్మశానం ఉండడంతో ప్రజలు వర్షాకాలంలో ఎవరైనా చనిపోతే వాటిని మోసుకెళ్లే నలుగురు వెంట వచ్చేవారు ఈ గుంతల్లో పడి మోకాలు, మోజేతులు నొప్పి పట్టేట్లు చేసుకోవాలి. కనీసం పది అడుగులు వేయాలన్నా వేయలేని పరిస్థితి. మృతదేహాన్ని భుజాలపై నెత్తుకున్న వారు పడే బాధతలు వర్ణణాతీతం. చచ్చిన శవాన్ని తీసుకునేవారి పరిస్థితి కూడా చచ్చేంత పనిగా మారుతుందని అంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లోకాసింతైనా దృష్టి సారించ ఉండా ఎలా అని వారంటున్నారు.



**ఎన్నోమార్లు చెప్పినా నిర్లక్ష్యమే**

ఆయకట్టు రోడ్డు బాగ లేదు. అందరూ ఇబ్బంది పడుతున్నారు. పంటల సాగు కాలంలో రైతులు ఈ దారి గుండా వెళ్లాలంటే భయపడి చివరికి పంటలు సాగు చేడయే మానుకునే పరిస్థిఇ వచ్చింది. మండల వ్యాప్తంగా ఇంత దారుణమైన దారి ఎక్కడా ఉండదేమో. ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకుంటే కదా..? మా సమస్య తీరేదెలా?

- పి.అయ్యవారురెడ్డి, రైతు, నరసారెడ్డిపల్లె



**నిధులు వచ్చాయి. కొంత వరకైనా రోడ్డ వేస్తాం**

ఉప్పరపల్లె గ్రామ పంచాయతీకి పరిధిలో వచ్చే ఈ నరసారెడ్డిపల్లెలోని ఆయకట్టు రోడ్డు నడిచేంఉదకు ప్రస్తుతం పంచాయతీలో ఆరున్నర లక్షలు నిధులు ఉంది. ఈ నిధులతో కొంత వరకు గ్రావెల్ రోడ్డు, తాగునీటి పైపు లైన్లు, మురుగుకాలువలు ఇతరత్రా పనులు చేపట్టాలి. కానీ వచ్చిన నిధుల్లో కొంతైనా ఈ దారి బాగు చేసేందుకు ఖర్చు చేస్తాం.

- షేక్ అన్వర్‌బాషా, పంచాయతీ కార్యదర్శి, ఉప్పరపల్లె

## కాంపౌండ్ వాల్ నిర్మాణానికి భూమిపూజ



పులివెందుల రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా కనంపల్లె గ్రామంలో అంగన్వాడీ కేంద్రం కాంపౌండ్ వాల్ నిర్మాణానికి భూ మి పూజ చేశారు. రూ.3.80లక్షల ఉపాధి హామీ పథకం నిధులతో ఈ కాంపౌండ్ వా ల్ నిర్మాణం చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రామాంజనేయరెడ్డి, ఏపీ ఓ పుష్పలత, పంచాయతీ, ఉపాధి, వెలుగు సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## 'ప్రత్యేక చర్చా కార్యక్రమాన్ని జయప్రదం చేయండి'

కడప (మారుతీనగర్), అక్టోబరు 17 (ఆం ధ్రజ్యోతి): పార్లమెంటరీ ప్రజాస్వామ్య పరిరక్షణ (వీపీపీ) ఆధ్వర్యంలో ఈనెల 19న ప్రెస్‌క్లబ్‌లో తలపెట్టిన ప్రత్యేక చర్చా కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు అన్ని పార్టీల, ప్రజాసంఘాల, విద్యార్థి, యువజ న, మహిళా సంఘాల ప్రతినిధులు తప్పక హాజరుకావాలని మహాజన రాజ్యం పార్టీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు సంగటి మనోహర్ కోరారు. గురువారం స్థానిక ఎ మ్మార్పీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన వి లేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చర్చా కార్యక్రమం అనంతరం కలిసివచ్చే పార్టీలు, ప్రజాసంఘాలతో ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామన్నారు.

## రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠ

చక్రాయపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): గండి క్షేత్రంలో సీతారామ ఆశ్రమంలో వెలసిన కోదండ రామాలయంలో నూతన ధ్వజస్తంభ, గణపతి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. వేదపండితులు, ఘనాపాటటి అయిన రాముస్వామి మరియు వేద పండితులు నరసప్పస్వామి,రాజాస్వామి,రాఘవేంద్రశర్మ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ ఏవిఎస్ఎస్ కుమారస్వామి గుప్త దంపతులు హాజరయ్యారు.

## డ్రైనేజీ పనులు త్వరితగతిన పూర్తిచేయాలి: కమిషనర్



అధికారులకు సూచనలు ఇస్తున్న కమిషనరు మనోజ్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : కోటిరెడ్డిసర్కిల్ వద్ద నిర్మాణమవుతున్న డ్రైనేజీ పనులను త్వరితంగా పూర్తి చేయాలని కమిషనరు మనోజ్‌రెడ్డి ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు. గురువారం ఆయన కోటిరెడ్డిసర్కిల్, ఆర్టీసీ బస్టాండు, వైజంక్షన్ నుంచి అప్సరసర్కిల్, చిన్నచౌకు, కొండాయపల్లెను ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగరంలో ఎక్కడ కూడా నీటిని నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

## 'దళితులపై దాడులను అరికట్టాలి'

కడప(వినాయకనగర్), అక్టోబరు17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా దళితులపై జరుగుతున్న దాడులను నివారించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని దళితమిత్ర సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కైపు రామాంజనేయులు హోం మంత్రి వంగలపూడి అనితను కోరారు. గురువారం విజయవాడలోని ఆమె చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఇందుకు హోం మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు ఒందెల ఓబయ్య, స్థానిక నాయకులు బ్రహ్మయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## కొట్టుకుపోయిన వంక బ్రిడ్జి

వీరపునాయునిపల్లె, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): బునిరెడ్డిపల్లె సమీపంలో ఉన్న బ్రిడ్జి వంక వర్షాలకు కొట్టుకుపోయింది. దీంతో కొమ్మద్ది, అడవిచెర్లోపల్లె గ్రామాలకు వెళ్లే వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగింది. వంక బ్రిడ్జి తెగిపోవడంతో 20కిలోమీటర్లు తిరిగి వెళ్లాల్సి వస్తోందని, కల్వర్టు ఏర్పాటుచేయాలని కోరుతున్నారు.

## పురోహిత స్మార్త విద్వత్ సభను దిగ్విజయం చేయండి

కడప (కల్చరల్), అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): భీమవరంలో నిర్వహిస్తున్న పురోహిత స్మార్త విద్వత్ సభను విజయవంతం చేయాలని ఏపీ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య జిల్లా గౌరవాధ్యక్షుడు బ్రాహ్మణపల్లి చంద్రమౌళిశర్మ, అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సత్యనారాయణశర్మ, వారణాసి శ్రీధర్‌శర్మ పిలుపునిచ్చా రు. గురువారం గడ్డిబజార్‌లోని సోమసుందరేశ్వర స్వామి దేవాలయంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. పురోహిత మౌఖిక పరీక్షల అనంతరం ఉత్తీర్ణులై న బ్రాహ్మణులకు అక్కడే పట్టా ప్రదానం చేస్తారన్నారు. తద్వారా బ్యాంకులలో గృహ రుణాలు, వ్యక్తిగత రుణాలు పొందవచ్చన్నారు. పట్టా ప్రధానోత్సవ కార్యక్రమానికి తపోవన పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామీజీ, భువనేశ్వరీ పీఠాధిపతి కమలానంద భారతి, వివిధ మఠాల పీఠాధిపతులు, టీడీపీ ప్రజాప్రతినిధలు, హాజరుకానున్నట్లు వివరించారు. కావున పురోహితులు ఈ అ వకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 991262 6900, 8977585886కు ఫోన్ చేయాలన్నారు.

## ఎస్‌డబ్ల్యూపీసీని ఆదాయవనరుగా మార్చుకోండి

● డీపీఓ రాజ్యలక్ష్మి



ఎస్‌డబ్ల్యూపీసీని పరిశీలిస్తున్న డీపీఓ రాజ్యలక్ష్మి

చెన్నూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీలో సేకరించిన చెత్త వ్యర్థాలను ఎరువుగా మార్చి వాటిని రైతులకు అందించి తద్వారా పంచాయతీకి ఆదాయాన్ని తెచ్చి పెట్టాలని జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి, ఈఓ ఆర్‌డీ సురేశ్‌బాబు పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డికి సూచించారు చెన్నూరు, కొండపేట గ్రామాల్లో ఉన్న ఎస్‌డబ్ల్యూపీసీని గురువారం డీపీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెత్త సేకరణ కేంద్రమే కదా అని వృథాగా ఉంచవద్దన్నారు. గ్రామాల్లో చెత్త సేకరణ వల్ల ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని, వ్యాధులు ప్రబలే అవకాశం తగ్గుతుందన్నారు. కావున ప్రతి పంచాయతీలో ఎస్‌డబ్ల్యూపీసీని వృథాగా ఉంచవద్దన్నారు. అక్కడ ఆహ్లాదకర వాతావరణం కలిగేలా పండ్లు, పూలమొక్కలు పెంచాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమాల్లో సర్పంచ్‌లు వెంకటసుబ్బయ్య, చంద్రయాదవ్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉప్పునీటి పిచికారీతో వరిని కాపాడుకోవచ్చు

చెన్నూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : వర్షం వల్ల నేలవాలిన వరిని ఉప్పునీటిని పిచికారీ చేసి గింజ నాణ్యత తగ్గకుండా కాపాడుకోవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ వీరయ్య, ప్రోగ్రాం కో ఆర్డినేటరు అంకయ్యకుమార్ అన్నారు. గురువారం మండలంలో తుఫాను దాటికి నేలవాలి నీరు నిలిచిన వరి పొలాలను శాస్త్రవేత్తలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు రైతులతో మాట్లాడుతూ వరిలో నిలిచిన నీటిని చిన్నపాటి కాల్వల ద్వారా బయటికి తరలించాలన్నారు. అలాగే వరి కోయకముందే వాటిని చిన్న చిన్న బోదెలుగా కట్టుకుని లీటరు నీటికి 50 గ్రాములు ఉప్పు కలిపి పిచికారీ చేయడం ద్వారా వర్షం వల్ల గింజ నల్లబడుతుందేమోనన్న భయం లేకుండా ఉంటుందన్నారు.

## చోరీలు, అసాంఘిక కార్యకలాపాల అడ్డుకట్టకు పోలీసు కవాతు

చెన్నూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) :చెన్నూరు మండల వ్యాప్తంగా పెరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలు, చోరీలకు అడ్డుకట్ట వేసేందుకు గురువారం రాత్రి సీఐ పురుషోత్తం రాజు చెన్నూరు, కొండపేట గ్రామాల్లో రెండు గంటల పాటు కవాతు నిర్వహించారు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు ప్రత్యేక పోలీసు బృందంతో కవాతు నిర్వహించామని, ప్రజలు కూడా సహకరించాలని కోరారు. ఎలాంటి గొడవలు జరిగినా ప్రజలు తమకు తెలుపాలని సూచించారు.

## సమస్యలు పరిష్కారం కానప్పుడు సభలెందుకు?



మాట్లాడుతున్న ఎంపీడీఓ జ్యోతి

కమలాపురం రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : గత సమావేశంలో చర్చించిన సమస్యలు ఏవీ పరిష్కారం కానప్పుడు సభలు నిర్వహించడం ఎందుకని ఎంపీపీ గండిభారతి అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఎంపీడీఓ జ్యోతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పలు చోట్ల పైపులు పగిలిపోయి తాగునీరు లీకేజీ అవుతోందని, మరమ్మతులు చేపట్టాలన్నారు. శనగలు బయట మార్కెట్లో ఉన్న ధర కంటే ఎక్కువగా ఉన్నాయని, దీని వల్ల రైతులకు ఒరిగిందేమీలేదన్నారు. విద్యుత్‌శాఖ ఏఈ చాంద్‌బాషా మాట్లాడుతూ కొత్త ట్రాన్స్‌ఫార్మరు, స్తంభాలు వచ్చాయని, అవసరం ఉన్న చోట ఏర్పాటు చేస్తామన్నారు. ఎంపీడీవో జ్యోతి మాట్లాడుతూ గత సమావేశంలో చర్చించిన అంశాలనే ఇంత వరకు చేయలేదని, ఇప్పటికైనా చేయాలని అధికారులకు సూచించారు. పీఆర్ ఏఈ నిరంజ న్‌రెడ్డి, హౌసింగ్ ఏఈప్రతాప్‌రెడ్డి, ఎండీఓ సుభాషిణి, వెలుగు ఏపీ యంగంగాదర్, ఉపాధి ఏపీయం పార్థసారధి తదితరులు తమ శాఖ పనితీరు గురించి వివరించారు. జడ్పీటీసీ సభ్యురాలు సుమిత, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## వాల్మీకి సిద్ధాంతాలు సమాజానికి మార్గదర్శకాలు

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆదికవి వాల్మీకి మహర్షి సిద్ధాంతాలు సమాజానికి మార్గదర్శకమని వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి తెలిపారు. గురువారం వాల్మీకి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాల్మీకి రచించిన వాల్మీకి రామాయణాన్ని భారతీయులు ప్రామాణికంగా తీసుకున్నారన్నారు. అనంతరం ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి మాట్లాడారు. హ్యూమనిటీ డీన్ ప్రొఫెసరు కె.గంగయ్య, ప్రొఫెసరు చంద్ర ఓబుల్‌రెడ్డి, రామక్రిష్ణ పాల్గొన్నారు.

## కూటమితోనే వార్డులకు మహర్దశ

పులివెందుల టౌన్, అక్టోబరు 17 :టీడీపీ కూటమి ప్రభుత్వంతోనే వార్డులకు మహర్దశ అని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ రాష్ట్ర కార్యదర్శి తూగుట్ల మధుసూదనరెడ్డి అన్నారు. గురువారం మున్సిపాలిటీలోని అహోబిళాపురం, సీఎస్‌పురం వార్డుల్లో ఆయన పర్యటించారు. మురుగుకాల్వల్లో చెత్తచెదారం తీసేయాలని, రహదారులను పరిశుభ్రంగా ఉంచాలని కమిషనరు సిబ్బందికి సూచించారు.

## ఉద్యాన పంటల్లో జాగ్రత్తలు తీసుకోవాలి

సీకేదిన్నె, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షానికి ఉద్యాన పంటల్లో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని ఉద్యాన శాఖ అధికారి కె.జ్యోతిర్మయి తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం మామిళ్లపల్లె పంచాయతీ బలిజపల్లెలో పత్తి పంటను, చింతకొమ్మదిన్నెలో చామంతి పంటలను గురువారం పరిశీలించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ సహాయకులు ప్రశాంతి, రైతులు పాల్గొన్నారు.

## వాల్మీకి జయంతిలో వికాస్ హరిక్రిష్ణ



వాల్మీకి విగ్రహానికి పూలమాల వేస్తున్న వికాస్ హరిక్రిష్ణ

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : కడప నగరం ట్రాఫిక్ పోలీసుస్టేషను ఎదురుగా ఉన్న వాల్మీకి విగ్రహానికి టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరిక్రిష్ణ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో లోకేశ్ ఇచ్చిన హామీ మేరకు వాల్మీకి జయంతిని రాష్ట్రపండుగగా నిర్వహించడం ఎంతో సంతోషదాయకమన్నారు. ఇది టీడీపీ ఇచ్చిన గౌరవమన్నారు. 22వ డివిజను ఇన్‌చార్జ్ శ్రీనివాసులు, నాయకులు అనిల్, రాజు పాల్గొన్నారు.

## మండల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

సీకేదిన్నె, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీడీవో కుళాయిబాబు తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం తాడిగొట్ల, పబ్బాపురం పంచాయతీల్లో సిమెంటు రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాల్లో అవసరమైన రోడ్లు ఏర్పాటు చేసేందుకు అదిక ప్రాధాన్యత ఇస్తోందని, అందుకు అవసరమైన నిధులు కూడా మంజూరు చేయడం జరిగిందని, మూడు నెలల్లో ప్రజలకు అందుబాటులోకి వస్తాయన్నారు. ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని వారికి అవసరమైన అన్ని పనులు ప్రాధాన్యత క్రమంలో చేపట్టేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఈవోఆర్‌డీ డి.వి.సుబ్బారెడ్డి, సర్పంచ్ సాలక్క, పంచాయతీ కార్యదర్శి కాంతమ్మ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## బహిరంగ మద్యపాన నిరోధానికి చర్యలు

కమలాపురం రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం చేయకూడదని అలా సేవించినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ రోషన్, ఎస్ఐ ప్రతాప్ రెడ్డి అన్నారు. గురువారం ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు కడప సబ్ డివిజనల్ పోలీసు ఆఫీసరు వెంకటేశ్వర్లు ఉత్తర్వుల మేరకు కమలాపురం సీఐ రోషన్, ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి సిబ్బంది సహకారంతో పోలీసుస్టేషన్ పరిధిలో కంపచెట్లు, ఇతర పిచ్చిమొక్కలు తొలగించారు.

## బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం నేరం

వల్లూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వల్లూరు మండల పరిధిలోని దేవాలయాలు, పాఠశాలలు పార్కులు, బహిరంగ ప్రదేశాల్లో డోజరుతో గురువారం వల్లూరు ఎస్ఐ సంజీవరాయుడు పరిశుభ్రత చేయించారు. ఎక్కడైనా బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం సేవిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## సీసీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

చక్రాయపేట, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెర్సుపల్లె గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమంలో గురువారం సీసీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ ఇన్‌చార్జి మహేశ్వర్‌రెడ్డి, నెర్సుపల్లె మాజీ సర్పంచు సుబ్బరామయ్య, ఎంపీడీఓ రాజశేఖర్‌రెడ్డి, ఏపీఓ రవి, సానే రాహుల్, ప్రజలు పాల్గొన్నారు.

## శేషయ్యగారిపల్లెలో ఇళ్లల్లోకి నీరు



శేషయ్యగారిపల్లెలో ఓ ఇంట్లోకి చేరిన వాన నీరు

చెన్నూరు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శేషయ్యగారిపల్లెలో గురువారం ఇళ్లల్లోకి వాననీరు చేరడంతో ప్రజలు ఇబ్బందిపడ్డారు. కొప్పర్తి పారిశ్రామకవాడకు తాగునీటి పైపులైను కోసం కాంట్రాక్టర్లు ఎక్సకవేటరుతో పైపు లైను తీసి పూడ్చిన తరువాత అక్కడ వర్షం నీరు వెళ్లేందుకు చిన్నపాటి కాల్వ కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో ఇళ్లలోకి నీరు వెళ్లాయని స్థానికులు తెలిపారు. ఇంట్లోని సామగ్రి, బట్టలు, ఆహార పదార్థాలు కూడా నీటిలో తడిచి నష్టపోయామని ప్రజలు ఆవేదన చేశారు. ఇందుకు కారకుమైలన కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని వారు పేర్కొన్నారు.


## డైలీవేజ్ వర్కర్లను కొనసాగించాలి



కలెక్టరేట్ వద్ద నిరసన తెలియజేస్తున్న కార్మికులు

కడప సెవెన్‌రోడ్స్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : డైలీవేజ్ వర్కర్లను కొనసాగించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోరుమామిళ్ల సుబ్బరాయుడు, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ మాట్లాడారు. కార్మికులందరికీ పనిభద్రత కల్పించి ఆప్కోస్‌లో చేర్చి ఈపీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం డీఆర్వో గంగాదర్‌గౌడ్‌కు వినతిపత్రం అందించారు. ఏఐటీయూసీ నగర కార్యదర్శి మద్దిలేటి, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యైనియన్‌గౌరవ అధ్యక్షుడు కేసీ బాదుల్లా, అధ్యక్ష కార్యదర్శులు నరసింహులు పాల్గొన్నారు.

## సమాచారచట్టంపై అవగాహన



మాట్లాడుతున్న ఏఓ శ్యామ్‌బాబు

వీరపునాయునిపల్లె, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టంపై గురువారం అవాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మండల వ్యవసాయాధికారి శ్యామ్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం సెక్షన్ 6,7(1) ప్రకారం దరఖాస్తు చేసుకున్న వ్యక్తులకు 30 రోజుల్లో అడిగిన సమాచారం పూర్తిస్థాయిలో ఇవ్వాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకున్న వ్యక్తులకు 30 రోజుల్లో సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల రైతు సేవా కేంద్రం సహాయకులురైతులు పాల్గొన్నారు.

## ఆర్‌టీఐ దరఖాస్తుకు సమాచారం ఇవ్వాలి



మాట్లాడుతున్న ఏఓ రమేష్

లింగాల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) ద్వారా సమాచారం అడిగిన దరఖాస్తుదారుకు పూర్తిస్థాయిలో సమాచారం ఇవ్వాలని మండల వ్యవసాయాధికారి రమేష్ సిబ్బందికి సూచించారు. గురువారం మండల కేంద్రమైన లింగాల రైతు సేవా కేంద్రంలో సమాచార హక్కు చట్టం-2005పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెక్షన్ 6,7 (1) ప్రకారం దరఖాస్తు చేసుకున్న వ్యక్తులకు 30రోజుల్లో సమాచారం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి సమాచారం ఇవ్వని సందర్భాల్లో సమాచార అధికారిపై జరిమానా, క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్నారు.

## ఇన్‌చార్జి మంత్రిని కలిసిన టీడీపీ నాయకులు



మంత్రి సవితకు వివరిస్తున్న వేంపల్లె మండల టీడీపీ నాయకులు

వేంపల్లె, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా బీసీ సంక్షేమ, చేనేత శాఖ మంత్రి సవితను వేంపల్లె మండలం గిడ్డంగివారిపల్లె, బక్కన్నగారిపల్లె నేతలు కలిశారు. విజయవాడలో మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక రాజకీయ పరిస్థితుల గురించి తెలియజేశారు. టీడీపీ గిడ్డంగివారిపల్లె క్లస్టర్ ఇన్‌చార్జి మల్లంగి సుధాకర్‌రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్ గణేష్‌నాయక్, కడప పార్లమెంట్ ఎస్టీ సెల్ వైస్ ప్రెసిడెంట్ రాజానాయక్‌లు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

## కొత్త దుకాణాలు, పాత ధరలు.. మందుబాబులకు ఝులక్




మద్యం కోసం గుమికూడిన మందుబాబులు

పులివెందుల టౌన్, అక్టోబరు 17 :కొత్త మద్యంపాలసీ అమల్లోకి వచ్చినా మందుబాబులను జేబ్రాండ్‌లు వదలనంటున్నాయి. కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తడంతో వారంరోజులపాటు వైసీపీ సర్కారు నాటిబ్రాండ్లనే అదే ధరలకు కొనుగలుచేచయాల్సిన పరిస్థిఇ ఏర్పఽడింది. గురువారం ప్రారంభమైన కొత్త దుకాణాలకు వెళ్లిన మందుబాబులు జేబ్రాండ్లను చూసి నివ్వెరపోయారు. ధర కూడా తగ్గకపోవడంతో వ్యాపారులను నిలదీశారు. వారంరోజులపాటు ఇవే దొరుకుతాయని ఎక్సైజ్ అధికారులు చెప్పడంతో శాంతించారు. పేద వర్గాలకు రూ.99కే నాణ్యమైన మద్యం అందిస్తామన్నారు. అయితే అందుబాటులోకి రాలేదు. మద్యంపాలసీ అమల్లోకి వచ్చిన వెంటనే ధరలు భారీగా తగ్గుతాయని సమీప రాష్ట్రాల సరిహద్దులప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటుచేయాల్సి ఉంటుందని విస్తృత ప్రచారం చేశారు. జగన్‌పాలనలో ఇక్కడ మద్యం కొనలేక ఇతర రాష్ట్రాల మద్యంను కొనుగోలు చేసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి రివర్స్ అయి ఆంధ్ర నుంచి ఇతర రాష్ట్రాలకు మద్యం తరలించకుండా సమీప రాష్ట్రాల చెక్‌పోస్టులు ఏర్పాటు చేసుకుంటారని ప్రచారం చేశారు. కానీ తెరుచుకున్న మద్యం షాపుల్లో ధరలు చూసి మందుబాబులు అవాక్కయ్యారు. పాత ధరలను యదాతథంగా ఉంచి షాక్ ఇచ్చింది. మరో పదిరోజుల్లో దరలు తగ్గించే అవకాశ ఉందని చెబుతున్నారు.

## వేల్పులలో అభివృద్ధి పనులకు శ్రీకారం

వేముల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): వేల్పుల గ్రామంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. గురువారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారధిరెడ్డి ఆధ్వర్యంలో పనుల ప్రారంభానికి పూజలు చేశారు. అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తాగునీటికి కటకట



మోరగుడి శ్రీరాములపేట రోడ్డుపై నీళ్లను పట్టుకుంటున్న స్థానికులు

జమ్మలమడుగు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ప్రాంతంలో నీటి సమస్యలు తలెత్తాయి. తుఫాన్ కారణంగా మూడు రోజులు ముందుగా అధికారులు హెచ్చరికలు చేశారు. గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయం, అక్కడి నుంచి పెన్నానదికి వరద ప్రవాహం కొనసాగుతోంది. పెన్నానది పరిసర ప్రాంతాల్లో అయిదు రోజులుగా మంచినీటి సమస్య ఉంది. మైలవరం మండలంలోని వేపరాల పెన్నానది కూతవేటు దూరంలో ఉన్నా ప్రజలకు అలాగే దొమ్మరనంద్యాల, మోరగుడి, జమ్మలమడుగు పెన్నానది పరిసర ప్రాంతాల ప్రజలకు మంచినీటి సమస్య ఉంది. అందులో భాగంగా మోరగుడిలోని శ్రీరాములపేట ప్రధాన రోడ్డు పక్కనే మంచినీళ్లకోసం ద్విచక్ర వాహనాల్లో, ఆటోల్లో వెళుతున్నారు. పెన్నానదికి వరద ఎప్పుడు వచ్చినా ఆ గ్రామాలకు నీటి సమస్య ఉంటుందని స్థానికులు వాపోతున్నారు. గ్రామాలకు మంచినీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

## డీఎస్పీ ఆధ్వర్యంలో క్రైం మీటింగ్

పోరుమామిళ్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో పోరుమామిళ్లలో క్రైం మీటింగ్ నిర్వహించారు. గురువారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆయన సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ కొండారెడ్డితో పాటు క్రైం మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సర్కిల్ పరిధిలో సంబంధించిన విషయాలను చర్చించారు.

# తుఫాన్ దెబ్బకు అతలాకుతలం

ముద్దనూరు అక్టోబరు17(ఆంధ్రజ్యోతి):మండలంలో తుఫాన్‌దెబ్బకు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పంటపొలాలు, రోడ్లు జలమయమయ్యాయి. చింతకుంట,యామవరం, చెన్నారెడ్డిపల్లె మరికొన్ని గ్రామాల్లో రైతులు సాగు చేసిన మినుము, కొర్ర,జొన్న, పత్తి పంటల్లోకి భారీగా వర్షం నీరు చేరింది. దీంతో పంటలు దెబ్బతిన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే ముద్దనూరు పాత బస్టాండు కుంటను తలపిస్తోంది. పులివెందుల రోడ్డు నుంచి వస్తున్న వర్షపు నీరు పోయేందుకు వీలు లేకపోవడంతో రోడ్డు పైనే భారీగా పాత బస్టాండు ఆవరణలోకి చేరుకుంది. చిన్న కత్తెరపల్లెలో మట్టి మద్దె పైకప్పు కూలిపోగా, గంగాదేవిపల్లెలో ఇంటి గోడలు పడిపోయాయి.దెబ్బతిన్న పంటలు, ఇళ్లను అధికారులు పరిశీలించారు.



ముద్దనూరు..చింతకుంటలో మినుముపైరులోకి చేరిన వర్షపు నీరు

### జలమయమైన రోడ్లు

ఎర్రగుంట్ల, అక్టోబరు 17(ఆంధ్రజ్యోతి): తుఫాన్ వల్ల వీధులు జలమయమయ్యాయి. సరైన డ్రైనేజీ వ్యవస్థలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల వేసిన ఎన్‌హెచ్ రోడ్డు గుంతలతో దర్శనమిస్తోంది. అసలే నాశిరకంగా వేసిన ఈరోడ్డు మూన్నాళ్ల ముచ్చటగా మారి పూర్తిగా ప్యాచ్‌ల మయంగా మారుతోంది. చిలమకూరులో కంచిరెడ్డి, సానా వీధి, ఇందిరా కాలనీల్లో, మరికొన్ని వీధుల్లో నీరు ఆగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎర్రగుంట్ల నగరంపచాయతీలోని హచ్‌టవర్‌రోడ్డు, ప్రకాష్ నగర్‌లోని రోడ్లు జలమయమయ్యాయి.కాగా ఎర్రగుంట్లలో వేసిన ఎన్‌హెచ్‌రోడ్డు పరిస్థితి దారుణంగా ఉంది. ఇది నాశిరకంగా ఉండటంతో మొదట్లోనే కొన్ని చోట్ల కుంగిపోయింది.

### ఉల్లిపంటపై రైతులు జాగ్రత్తలు పాటించాలి

కోత దశలో ఉన్న ఉల్లిపంటను రక్షించుకునేందుకు తగిన జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఉద్యాన అధికారి ఎస్ఎస్‌వీ సుభాషిణి రైతులను కోరారు. గురువారం ఆమె ఎర్రగుంట్ల మండలంలోని చిర్రాజుపల్లె, దండుపల్లె, తిప్పలూరు గ్రామాల్లో సాగుచేసిన ఉల్లిపంటను ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉల్లిపంట కోత దశలో ఉండి మురుగునీటిని బయటికి పంపాలని, గడ్డలను పీకిన తర్వాత 1గ్రాము కార్బెండిజమ్‌ను ఒక లీటర్ నీటిలో పిచికారీ చేసిన గడ్డకుళ్లను నివారించవచ్చునన్నారు. వీలైనంత త్వరగా గడ్డలను గ్రేడింగ్, ప్యాకింగ్ చేసి నిల్వ ఉంచాలన్నారు. ఈకార్యక్రమంలో ఉద్యాన అధికారి రెడ్డెయ్య, సహాయక సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

**కొండాపురం..:** తుఫాన్ ప్రభావంతో మండలంలో రెండురోజులు పాటు వర్షం కురిసింది. వర్షం వల్ల ఆరుతడి సాగు చేసిన పంటలకు ఉప యోగం ఉంటుందని రైతులు భావిస్తున్నారు. కాగా మండలంలో పలుచోట్ల రోడ్లన్నీ బురదమయమయ్యాయి.

**జమ్మలమడుగు..:** జమ్మలమడుగులో గత మూడు రోజుల నుంచి అప్పుడప్పుడు ఎడతెరపి లేని వర్షం కురిసింది. గురువారం ఉదయాన్నే ఓ మోస్తారు వర్షం కురవడంతో పలు ప్రాంతాల్లో భారీగా వర్షపునీరు నిలిచింది. ప్రధానంగా జమ్మలమడుగు విద్యుత్తు సబ్‌డివిజన్ కార్యాలయ ఆవరణంలో డీఈ కార్యాలయం చుట్టూ వర్షపునీరు నిలిచాయి.

అలాగే పట్టణంలోని ఎత్తపువారి కాలనీ రోడ్డుపొడవునా వర్షపునీరు నిలిచింది. అలాగే కన్నెలూరులోని ఎస్సీ కాలనీ, గొరిగెనూరు వెళ్లే దారి, సిమెంటు రోడ్డుపై భారీగా వర్షపునీరు నిలిచింది.







ముద్దనూరు...పాత బస్టాండ్‌లో కుంటను తలపిస్తున్న వర్షపునీరు, ఎర్రగుంట్ల..చిలమకూరులో వీధుల్లో ఆగిన నీరు, జమ్మలమడుగు ఎత్తపువారి కాలనీ వెళ్లే దారిలో నిలిచిన వర్షపునీరు

## 20న దాంపత్యవ్రత హోమం

మైదుకూరు రూరల్ అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : వేణుదత్త సువర్ణ లక్ష్మీ దాంపత్యవ్రత హోమం ఈనెల 20వ తేదీన కశెట్టి కళ్యాణ మండపంలో జరుగునని నియోజక వర్గంలోని 1000 మంది దంపతులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని గురువారం చాపాడు మండల టీడీపీ అధ్యక్షుడు అన్నవరం సుధాకర్‌రెడ్డి తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిత్యం హిమాలయాల్లో పలు హోమాలు నిర్వహిస్తున్న రామదూతస్వామి మొదటి సారిగా మైదు కూరు పట్టణంలో వేణుదత్త సువర్ణలక్ష్మీ దాంపత్యవ్రత హోమం నిర్వహిస్తున్నందున నియోజకవర్గంలోని హిందూ దంపతులందరూ హాజరు కావాలని కోరారు. హోమం వద్ద కూర్చునే దంపతులు పసుపు పచ్చ చీర లేదా పట్టుచీర ధరించాలని,మగవాళ్లు తెల్లపంచె, తెల్లచొక్కా, లేదా తెల్లపంచె ధరించాలని తెలిపారు. ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు అందరూ మండపం వద్దకు చేరుకోవాలని తెలిపారు. హోమం తరువాత స్వామి వారి ఉపన్యాసం, అనంతరం భోజనాలు ఉంటాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు దాసరిబాబు, యాపారాల చిన్న, లక్ష్మీ నారాయణ, చీకిరి వెంకటసుబ్బయ్య, గొల్లమందల శ్రీధర్, పెద్దయ్య ,రాధ, బాబురావు పాల్గొన్నారు.

## సమాచార హక్కును అందరూ తెలుసుకోవాలి

మైదుకూరు రూరల్ అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : సమాచార హక్కు చట్టంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఏవో లక్ష్మీప్రసన్న తెలిపారు. స్థానిక మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమాచార హక్కు చట్టం పట్ల అందరూ అవగాహన కలిగి ఉండాల ఆమె తెలిపారు.

## ఉత్సాహంగా భూపేశ్‌రెడ్డి జన్మదిన వేడుకలు



మద్దునూరులో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

ముద్దనూరు అక్టోబరు17(ఆంధ్రజ్యోతి):స్థానిక పాత బస్టాండు సర్కిల్‌లో గురువారం జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి జన్మదిన వేడుకలు టీడీపీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు.టీడీపీ మండల ఇన్‌చార్జి చింతా శివరామిరెడ్డి ఆధ్వర్యలో టీడీపీ కార్యాలయం వద్ద నుంచి భారీ ఎత్తున నాయకులు, కార్యకర్తలు పాత బస్టాండు సర్కిల్ వద్దకు తరలి వచ్చారు.బాణా సంచా పేల్చి, కేక్ కట్ చేసి భూపేశ్‌రెడ్డికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కేశవరెడ్డి, జగదీశ్వరరెడ్డి, శేఖర్‌నాయుడు, చంద్ర ఓబుల్‌రెడ్డి,లక్ష్మీనారాయణ,బాబురెడ్డి,నాగేశ్వరరావు,కుడుముల భాస్కర్‌రెడ్డి,ఆది, శ్రీకాంత్, నడిపన్న,పవన్‌కుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.



మైలవరం... నవాబుపేటలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ కార్యకర్తలు

**మైలవరం..:** జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జ్ చదిపిరాళ్ల భూపేశ్‌రెడ్డి జన్మదిన వేడుకలను గురువారం మండలంలో ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని నవాబుపేట, గొల్లపల్లి గ్రామాల్లో భూపేష్‌రెడ్డి యువసేన ఆధ్వర్యంలో టీడీపీ అభిమానులు, కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## మానసిక వికలాంగులకు అన్నదానం



కొండాపురం, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి జన్మదినం సందర్భంగా మండల టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి గోరిశెట్టిబాబు ఆధ్వర్యంలో గురువారం మంగపట్నం మానసిక వికలాంగుల కేంద్రంలో అన్నదానం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి మానసిక వికలాంగులకు అన్నదానం నిర్వహించారు. తమ అభిమాన నాయకుడు భూపేశ్ జన్మదినం సందర్భంగా మానసిక వికలాంగులకు అన్నదానం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగిరెడ్డి, శివ , బాలిరెడ్డి,వీరశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు



జమ్మలమడుగులో వాల్మీకి మహర్షికి నివాళులర్పిస్తున్న నేతలు

జమ్మలమడుగు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో గురువారం వాల్మీకి సేవా సమితి ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం వాల్మీకి సేవా సమితి అధ్యక్షుడు పెద్దకంబయ్య ఆ సంఘం నాయకులు నిర్వహించారు. ముందుగా పట్టణంలోని శ్రీ కోదండరామస్వామి దేవాలయం నందు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ముద్దనూరు రోడ్డులోని వాల్మీకి మహర్షి విగ్రహానికి పాలాభిషేకం చేసి పూజలు నిర్వహించి విగ్రహానికి జయంతి నివాళులర్పించారు. అనంతరం జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రిలో మెడికల్ సూపరింటెండెంట్ రఫీక్‌పాషా, వాల్మీకి సంఘం వారు రోగులకు పండ్లు, బ్రెడ్లు, బిస్కెట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి సేవా సమితి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● **వాల్మీకి మహర్షికి ఘన నివాళి..:** వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా జమ్మలమడుగు-ముద్దనూరు రోడ్డులో వాల్మీకి విగ్రహానికి మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి, ఆ పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్డీయే కూటమి నాయకులు పాల్గొన్నారు.

## రామాయణం మన ఆదర్శ గ్రంథం : ఎమ్మెల్యే

ప్రొద్దుటూరు , అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : వాల్మీకి రామాయణమే నేటికీ మనకు ఆదర్శనీయమైన గ్రంథం అని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. గురువారం వాల్మీకి జయంతి సందర్భంగా కొత్తపల్లె సర్కిల్లోని వాల్మీకి విగ్రహానికి ఆయన పూల నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం నేత రిటైర్డ్ ఎస్ఐ ఆంజనేయులు, సుంకర వేణు పాల్గొన్నారు.

## మంత్రి సత్యకుమార్‌ను కలిసిన బీజేవైఎం నాయకులు

బద్వేలు రూరల్, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్‌ను ఉండవల్లి సచివాలయంలో ఆయన కార్యాలయంలో గురువారం పట్టణానికి చెందిన బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పవన్‌కుమార్, మాదా సురేంద్ర ఆయనను కలిశారు. ఈసందర్భంగా బద్వేలు, గోపవరం మండలాల్లో అధిక శాతం భూకబ్జాలు, ల్యాండ్ సెటిల్‌మెంట్లు జరిగాయని, గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో భూకబ్జాదారుల అరాచకాలకు అడ్డు లేకుండాపోయిందని మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు వారు తెలి పారు. కూటమి ప్రభుత్వంలో భూకబ్జాదారులకు అడ్డుకట్ట వేసి అసలైన లబ్ధిదారులకు న్యాయం చేకూరేలా చర్యలు తీసుకోవాలని మంత్రిదృష్టికి తీసుకెళ్లినట్లు వారు తెలిపారు.

## నేటి నుంచి సర్పంచ్‌లకు శిక్షణ తరగతులు

కలసపాడు, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కలసపాడులోని ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 18, 19 తేదీల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మహబూబ్‌బీ తెలిపారు. శిక్షణలో సర్పంచ్, ఇద్దరు వార్డుమెంబర్లు, తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు హాజరవుతారని తెలిపారు.

**కాశినాయన..:**నర్సాపురంలోని వెలుగు కార్యాలయ సభాభవనంలో శుక్రవారం నుంచి రెండు రోజులపాటు ఉపసర్పంచ్‌లు,పలువురు వార్డు మెంబర్లకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మైథిలీ తెలిపారు. ఈశిక్షణ తరగతుల్లో ప్రతి పంచాయతీ నుంచి ఉపసర్పంచ్‌తో పాటు ఇద్దరు వార్డు సభ్యులకు శిక్షణను ఇవ్వడం జరుగుతుందన్నారు.

## జనావాసాల మధ్య మద్యం దుకాణం వద్దు



ప్రొద్దుటూరు, అక్టోబరు 17 : జనావాసాల మధ్య మద్యం దుకాణాలు పెట్టవద్దని చైతన్య మహిళాసంఘం జిల్లా కన్వీనర్ పద్మ హెచ్చరించారు. గురువారం స్థానిక వసంతపేట, సాయిబాబా కొట్టాల మహిళలు తమ ఆవాసాల మధ్య మద్యం దుకాణం పెడుతున్నారని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పద్మమాట్లాడుతూ ఐదేళ్ళ క్రితం ఇదే స్థానంలో పెట్టిన మద్యం దుకాణం వల్ల మహిళలు, పిల్లలు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారని నాడు ఆ మద్యం దుకాణం ఎత్తేయాలని మహిళలు సంఘాల ఆధ్వర్యంలో పోరాడారన్నారు. అక్కడినుంచి ఆ మద్యం దుకాణం ఎత్తేయించుకున్నారన్నారు. కానీ మళ్లీ ఐదేళ్ల తరువాత అదే స్థానంలో మద్యం దుకాణం పెట్టడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని దీనిని వ్యతిరేకిస్తూ మహిళలు జాయింట్ కలెక్టరు అతిథి సింగ్‌ను కలిసి వినతి పత్రం ఇచ్చారన్నారు. ఆమె మహిళలకు ఇబ్బందులున్న చోట మద్యం దుకాణం పెట్టరాదని ఎక్సైజ్ అధికారులను సైతం ఆదేశించారన్నారు. డీఎస్పీ, ఎక్సైజ్ సీఐలకు సైతం అక్కడ మద్యం దుకాణం పెట్టవద్దని వినతి పత్రాలు అందజేశారన్నారు. కార్యక్రమంలో మహిళా శక్తి కన్వీనర్ వడ్ల లక్ష్మీదేవి, విద్యార్థిశక్తి కన్వీనర్ హరిత, టీడీపీ నేత తలారి రమేష్, జింకా సుబ్బయ్య, పుల్లగూర చంద్రశేఖర్ తదితులు పాల్గొన్నారు. ఈ ఆందోళన సందర్భంగా ఒన్‌టౌన్ పోలీసులు, ఎక్సైజ్ సీఐ అక్కడి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడారు. ఇక్కడ పెట్టనీయకుండా చూస్తామని హామీ ఇచ్చారు.దీంతో వారు ఆందోళన విరమించారు.

# అధ్వానంగా రహదారులు





రామేశ్వరం వద్ద రోడ్డుపై ఉన్న గుంతను చూపిస్తున్న సీపీఐ నాయకులు, పోరుమామిళ్లలోని సాయిబాబా దేవాలయం వద్ద రోడ్డుపై నిలిచిన నీటిలో వరినాట్లతో నిరసన తెలుపుతున్న సీపీయం నాయకులు

పోరుమామిళ్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్ల రహదారులు అ చినుకుపడితే చేపల చెరువుగా తయారయ్యాయని సీపీయం నాయకుడు భైరవప్రసాద్ అన్నారు. గురువారం ఆయన సీపీయం నాయకులు, కార్యకర్తలతో కలిసి పోరుమామిళ్లలోని సాయిబాబా దేవాలయం వద్ద వర్షం నీటిలో వరినాట్లు నాటి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు బీబీ, సుందరయ్య పాల్గొన్నారు.

**హైవే రోడ్డులో గుంతలు..:** పోరుమామిళ్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రరాజధానికి వెళ్లే ప్రధాన రహదారిపై బావుల్లాంటి గుంతలు ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటమాడుతోందని సీపీఐ బద్వేలు ఏరియా సహాయ కార్యదర్శి పిడుగుమస్తాన్, కార్యవర్గసభ్యుడు సునీల్‌కుమార్ అన్నారు. గురువారం పోరుమామిళ్ల మండలంలో బూరుగమాను పల్లె వరకు ఉన్న రహదారులను పరిశీలించారు. ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్ల అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని అన్నారు.



# పల్లెల ప్రగతే ప్రభుత్వ లక్ష్యం

పోరుమామిళ్ల, అక్టోబరు 17 (ఆంధ్రజ్యోతి): పల్లెల ప్రగతే సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లక్ష్యమని బద్వేలు టీడీపీ యువ నేత రితీష్ కుమార్‌రెడ్డి అన్నారు. పల్లెపండుగ ఉత్సవం కార్యక్రమంలో భాగంగా గురువారం పోరుమామిళ్ల మండలంలోని చల్లగిరిగెల దేవస్థానం వద్ద రూ.10లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సిమెంటు రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అలాగే గానుగపెంటలో రూ.14ల క్షల వ్యయంతో నిర్మిస్తున్న సిమెంటు రోడ్డు పనులకు కూడా శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో బీజేపీ నేత బొజ్జ రోశన్న,సర్పంచ్ యనమల సుధాకర్, టీడీపీ నాయకులు కొండా రామక్రిష్ణారెడ్డి, చెరకూరి చెన్నరాయుడు, రామసుబ్బారావు, సునీల్ కుమార్, గానుగపెంట వెంకటసుబ్బయ్య, ఎంపీడీవో రమణారెడ్డి పాల్గొన్నారు.

**అట్లూరు..:**మండలంలోని ఎస్.వెంకటాపురం గ్రామంలోని ఉప్పుటూరు కాలనీలో రూ.23లక్షల ఉపాధి నిధులతో మూడు సీసీ రోడ్లకు గురువారం మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, టీడీపీ కడప పార్లమెంటరీ అధ్యక్షురాలు సుధారాణి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎల్.నారాయణరెడ్డి, జేసీబీ సుబ్బారెడ్డి,క్రిష్ణారెడ్డి పరశురాముడు, ఏసయ్య, రఘురాం, అధికారులు ఎంపీడీవో భాస్కర్‌బాబు పాల్గొన్నారు.

**కాశినాయన..:** ప్రతి పల్లెలో సిమెంట్ రోడ్డును నిర్మించడమే పల్లెపండుగ ముఖ్యోద్దేశ్యమని నర్సాపురం మేజర్ పంచాయతీ సర్పంచ్ బి.చిన్నఖాజావలి.టీడీపీ నాయకుడు బి.రవీంద్రారెడ్డి(హోండా) పేర్కొన్నారు.



పోరుమామిళ్ల మండలంలోని చల్లగిరిగెల దేవస్థానం వద్ద సిమెంటు రోడ్డు పనులు ప్రారంభిస్తున్న టీడీపీ యువనేత రితీశ్‌కుమార్‌రెడ్డి

గురువారం పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా నర్సాపురం ఉప్పలూరు గ్రామల్లో సిమెంట్ రోడ్లకు భూమిపూజ చేశారు. ఈకార్యక్రమంలో ఉపాధి ఏపీవో జయరాముడు, టీడీపీ నాయకులు కే.నరసింహారెడ్డి, పి.పోలిరెడ్డి,నర్శిరెడ్డి ఎంపీటీసీ గౌసియా పాల్గొన్నారు.

**బి.కోడూరు..:** నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని బీజేపీ నేత బొజ్జ రోశన్న అన్నారు. గురువారం మండల పరిధిలోని ఐత్రంపేట గ్రామ పంచాయతీలో స్థానిక సర్పంచ్ ప్రభావతి ఆధ్వర్యంలో రూ.29లక్షలతో సిమెంటు రోడ్డుకు భూమిపూజ నిర్వహించారు.ఎంపీడీవో భాస్కర్‌రావు, నేతలు రామచంద్రారెడ్డి, గోడి రమణారెడ్డి, దుగ్గిరెడ్డి, బాలయ్య, పవన్, భాస్కర్‌రెడ్డి, రాఘవరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, సిద్దుగారిపల్లె నారాయణరెడ్డి, మహబూబ్‌బాషా, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

**ఖాజీపేట..:** పల్లెల్లో అభివృద్ధి పరుగులు పెట్టేలాఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ పనిచేస్తున్నారని టీడీపీ మండలాధ్యక్షుడు లక్ష్మీరెడ్డి అన్నారు. గురువారం పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా కూనవారిపల్లె, దుంపలగట్టు, రావులపల్లె పంచాయతీల్లో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో దివిజ, నాయకులు మామిళ్ల క్రిష్ణారెడ్డి, ఆదినారాయణరెడ్డి, ఇండ్ల సుబ్బారెడ్డి, రవి, గంగిరెడ్డి, మల్లికార్జునరెడ్డి, సుబ్బిరెడ్డి, గురివిరెడ్డి, బాలక్రిష్ణారెడ్డి, గంగాధర్‌రెడ్డి, సుబ్బరాయుడు, ప్రభాకర్, లక్కు సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

**చాపాడు..:** మండలంలోని ఆరు గ్రామాల్లో పల్లె పండుగ సందర్భంగా కొత్తగా సిమెంటు రోడ్లు నిర్మించేందుకు అధికారులు, టీడీపీ నాయకులు గురువారం భూమిపూజ చేశారు. ఎంపీడీవో రామానుజం, మండల టీడీపీ అధ్యక్షులు అన్నవరం సుధాకర్‌రెడ్డి, టీడీపీ అధికార ప్రతినిధి పిచ్చపాటి మునిశేఖర్‌రెడ్డి, టీడీపీ నాయకులు లోకేష్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, రవీంద్ర, కిశోర్‌కుమార్‌రెడ్డి, వీరారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, పూజలు చేసి టెంకాయ కొట్టారు.

**ముద్దనూరు..:** పల్లె పండుగ కార్యక్రమంతో గ్రామీణ ప్రాంతాలు ఎంతో అభివృద్ధి చెందుతాయని ఎంపీటీసీ కాంతమ్మ పేర్కొన్నారు. బాలుర ఉన్నత పాఠశాల రోడ్డులో పల్లె పండుగలో భాగంగా గురువారం సీసీరోడ్డు ఏర్పాటు కు భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఉమాదేవి, ఎంపీడీవో ముకుందారెడ్డి,సాగర్‌బాబు, సుబ్బరాయుడు, ఓబులేసు, నాగరాజు పాల్గొన్నారు.